PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 157 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 03 జూన్ 2026


**ప్రజా సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యత**




**తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మల్లంపల్లిలో ఘన వేడుకలు**




# ప్రజాకాంక్షలు నెరవేరుస్తాం

## ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహణ**

**అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించిన సీఎం**



- తెలంగాణ కోటి రత్నాలవీణ
- త్వరలోనే జాబ్ నోటిఫికేషన్లు విడుదల
- టీజీపీఎస్సీ ద్వారా విడుదల చేస్తాం
- జాబ్ నోటిఫికేషన్ల జారీ నిరంతర ప్రక్రియ
- న్యాయపరమైన సమస్యలు లేకుండా భర్తీ
- 67 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశాం
- నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తాం
- అద్దె ఇళ్ల బాధల నుంచి విముక్తి చేస్తాం
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం
- విజన్-2047 లక్ష్యం దిశగా ముందుకు..
- కాళోజీ స్పూర్తితో అధికారం చేపట్టాం
- నాటి నుంచి రాష్ట్ర హితంకై శ్రమిస్తున్నాం
- రాచరికం, పెత్తనాన్ని సమాజం సహించదు
- నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదు
- ప్రజాకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి





**హైదరాబాద్,జూన్ 2(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే పలు జాబ్ నోటిషికేషన్లను టీజీపీఎస్సీ విడుదల చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇక్కడ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం... రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదన్నారు. ప్రత్యేక తెలంగాణ కల సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకలలో భాగంగా విధుల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విశిష్టసేవా పురస్కారాలను ప్రదానం చేశారు. "పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది" అన్న ప్రజాకవి కాళోజీ నారాయణరావు మాటలను సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. కాళోజీ స్ఫూర్తితోనే తాము అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజల హితం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, తమది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వం అన్నారు. గత 30 నెలల తమ పాలనలో ప్రజా సంకల్పాన్ని నిజం చేయడంలో విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రైతులను వ్యవసాయ **మిగతాది 2లో...**

## అమరవీరుల త్యాగాలు,దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటాలు

**- ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**



**హైదరాబాద్,జూన్ 2(పిసిడబ్ల్యూ న్యూస్):** అమరవీరుల త్యాగాలకు, దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటాలకు ప్రతీక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం లోక్‌భవన్‌లో గవర్నర్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఆయన ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ, ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరికీ గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగించారు. ఆధునిక తెలంగాణ నిర్మాణానికి పునాదులు **మిగతాది 2లో...**

## బీజేపీకి సింగం అన్నామలై గుడ్‌బై!

**తదుపరి కొత్త పార్టీ ఏర్పాటుపై దృష్టి**

**సొంత పార్టీతో ఉపఎన్నికల్లో పోటీ!!**



**కోయంబత్తూరు, జూన్ 2(పిసిడబ్ల్యూ న్యూస్):** తమిళనాడు రాజకీయాల్లో సంచలన మార్పు చోటుచేసుకుంది. దేశవ్యాప్తంగా ఎంతో క్రేజ్ సంపాదించుకున్న ఐపీఎస్ మాజీ అధికారి, తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కే. అన్నామలై ఆ పార్టీకి రాజీనామా చేశారు. దిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్‌లను కలిసి తన 5 పేజీల రాజీనామా లేఖను సమర్పించారు. కొద్ది రోజులుగా అన్నామలై తదుపరి అడుగులపై సాగుతున్న ఉత్కంఠకు ఈ నిర్ణయంతో తెరపడింది. గత ఆరేళ్లుగా తమిళనాట బీజేపీకి 'స్టార్' ఇమేజ్ తెచ్చిన అన్నామలై, తాజాగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కలిసి రాజీనామా లేఖను అందజేశారు. ఐదు పేజీల సుదీర్ఘ లేఖలో ఆయన పార్టీ కేంద్ర నాయకత్వంతో తనకు ఉన్న వ్యూహాత్మక విభేదాలను స్పష్టంగా **మిగతాది 2లో...**

## బంగారం రీసైకిల్ చేద్దాం

**: ప్రధాని మోదీ పిలుపు**

**బంగారం దిగుమతులు తగ్గించి విదేశీ మారక నిల్వలను కాపాడటమే లక్ష్యం**

**ఒక శాతం బంగారం రీసైకిల్ చేసినా దిగుమతులు 30% తగ్గుతాయని నిపుణుల అంచనా**




## అకాల వర్షాలతో రైతులు కన్నీరు

**తడిసి ముద్దవుతున్న వరి ధాన్యం**

**ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు**



**హైదరాబాద్, జూన్ 2(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆరుగాలం కష్టపడి పండించిన పసిడిపంట చేతికొచ్చే సమయానికి అన్నదాతను ప్రకృతి పగబట్టి ఆడుకుంటోంది. ఉదయం పూట భగభగ మండుతున్న ఎండలు కమ్మేస్తుంటే.. రాత్రి కాగానే విరుచుకుపడుతున్న కారుమబ్బులు, భయపెడుతున్న ఈదురుగాలులు, అకాల వర్షాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాతావరణం పూర్తిగా అతలాకుతలమైంది. పగలు దంచికొడుతున్న ఎండల తీరు ఒకలా ఉంటే రాత్రివేళ ముంచుకొస్తున్న అకాల వర్షాలు రైతన్నల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. **మిగతాది 2లో...**

## ఇంకెంత కాలం ఆంధ్రావాళ్లను తిడతారు

- జనసేన పుట్టిందే తెలంగాణలో
- అందుకే ఇక్కడి ఎన్నికల్లో పోటీ చేస్తుంది
- తెలంగాణ గడ్డపై నుంచే పోరాటం పుణికి పుచ్చుకున్నా
- తెలంగాణ అంటే గౌరవంతోనే కొండగట్టుకు కోట్ల విరాళం
- తెలంగాణను వ్యతిరేకించిన వారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు
- తెలంగాణకు ద్రోహం జరిగితే గొంతు లేపేది జనసేనే
- తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతం
- ఎవరి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు
- మీడియా సమావేశంలో పవన్ కళ్యాణ్ స్పష్టీకరణ



**హైదరాబాద్,జూన్ 2(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. తెలంగాణలో పోటీ చేస్తామని ఆయన కుండ బద్దలు కొట్టారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. దేశంలో అంతర్భాగం తెలంగాణ అని స్పష్టం చేశారు. **మిగతాది 2లో...**




## భారత్‌లో ఎబోలా కేసులు లేవు.. కానీ!

**: కేంద్రం కీలక అడ్వైజరీ**

**అంతర్జాతీయ ప్రయాణికుల కోసం కేంద్ర ఆరోగ్య శాఖ మార్గదర్శకాలు**

**ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించడంతో అప్రమత్తత**

**ఈ వైరస్‌కు టీకాలు లేకపోవడంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన**

## సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

**పుష్కర తెలంగాణ కాస్తా ముష్కర తెలంగాణ**

**తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ నేత కెటిఆర్**



**హైదరాబాద్,జూన్ 2(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. పలువురు తెలంగాణ కళాకారులకు కేటీఆర్ **మిగతాది 2లో...**

# ప్రజాకాంక్షలు నెరవేరుస్తాం



**(మొదటి పేజీ తరువాయి)**

పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ఈ వేదికగా హామీ ఇచ్చారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఇప్పటివరకు 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త అందించారు. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజినీరింగ్, పీసీబీ, అటవీశాఖ, టౌన్‌ప్లానింగ్, విద్యాశాఖల్లో ఖాళీలకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ప్రకటించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, విద్యా రంగంలో భాగంగా ఇప్పటికే 1,362 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ క్లాసులు ప్రారంభించామన్నారు. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని, త్వరలోనే జూనియర్ కాలేజీల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అద్దె ఇళ్ల బాధలు, కష్టాల నుండి పేదలకు విముక్తి కలిగించేందుకు గత 13 నెలల కాలంలో 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించగా, ఇందుకోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 3.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఈసారి క్యూఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. కొత్త రేషన్‌కార్డులను కూడా పంపిణీ చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ఈ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం వెల్లడించారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం సహించదన్న రేవంత్, ప్రభుత్వం అంటే నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదని స్పష్టం చేశారు. తమది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వమన్న సీఎం, గత 30 నెలల్లో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విజయవంతం అయ్యామన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యం సాధించే దిశగా వెళు_న్నామని స్పష్టం చేశారు. రైతులను వ్యవసాయ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం తెలిపారు. జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి మళ్లీ కృషి చేస్తున్నామని చెప్పారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని సీఎం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఒకేసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి చేశామని సీఎం తెలిపారు. తొలి ఏడాదిలోనే రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైతుల పంటలు చివరి గింజ వరకు కొనేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు రూ.11,300 కోట్లు జమ చేశామని తెలిపారు.మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు రేవంత్? రెడ్డి తెలిపారు. మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు ఇచ్చామని చెప్పారు. తెలంగాణ మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు రూ.10 వేల కోట్లు ఆదా చేసుకున్నారన్న ముఖ్యమంత్రి, 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. రెండున్నరేళ్లలో ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయం సాధించాం. రాష్ట్రంలో రైతుల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నాం. గత ప్రభుత్వం లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది. మరమ్మతులు చేయించే భారం ప్రభుత్వంపై పడింది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను విజయవంతంగా చేపట్టాం. రికార్డు సమయంలో 67,763 పోస్టులను భర్తీ చేశాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా విద్యా వ్యవస్థ మరి బలోపేతం కానుంది. పేదలను అద్దె బాధలనుంచి విముక్తి చేయాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

కాగా.. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా అసెంబ్లీ సమీపంలోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాల్లో సంబంధిత మంత్రులు జాతీయ జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాత్రి వేళల్లో హైదరాబాద్‌లోని సచివాలయం, అసెంబ్లీ భవనాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తొలి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, రూ.22 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. హనుమకొండలో అమరవీరుల స్థూపానికి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వద్ద నివాళి అర్పించి జెండాను ఆవిష్కరించారు. నల్గొండ క్లాక్ టవర్ కూడలి వద్ద అమరవీరుల స్థూపానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాళి అర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి పుష్పాలతో నివాళి అర్పించారు. అనంతరం పోలీసు పరేడ్ మైదానంలో జాతీయపతాకావిష్కరణ చేశారు. నల్గొండలోని కలెక్టరేట్?లో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. అమరవీరుల త్యాగ ఫలితమే మన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమని తెలిపారు. తెలంగాణ చరిత్ర గురించి మాట్లాడాలంటే నల్గొండ ప్రస్తావన లేకుండా ఒక్క పేజీ కూడా ముందుకు సాగదన్నారు. నల్గొండ కేవలం జిల్లా కాదని విప్లవాల పురిటి గడ్డ, అన్యాయంపై తిరగబడ్డ వీరుల అడ్డా అని వెంకట్?రెడ్డి చెప్పారు. నా భూమి జోలికొస్తే ఆ భూమిలోనే నీ గోరి కడతాం అని దొరల గుండెల్లో వణుకు పుట్టించిందన్నారు. నల్గొండ గడ్డ మన పిల్లలు లాఠీ దెబ్బలు తింటే, శ్రీకాంతాచారి తన ప్రాణాన్ని త్యాగం చేస్తుంటే చూస్తూ ఊరుకోలేదని అన్నారు. తానెప్పుడూ పదవుల కోసం ఆశపడలేదని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్ష నెరవేరకపోతే ఈ పదవులు ఎందుకని నాడు మంత్రి పదవిని విసిరికొట్టి ఉద్యమంలోకి దిగిన చరిత్ర తనదన్నారు.

## బీజేపీకి సింగం అన్నామలై గుడ్‌బై!

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రస్తావించినట్లు తమిళ మీడియా వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేకించి ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే తో పొత్తు పెట్టుకోవాలన్న దిల్లీ పెద్దల నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బీజేపీ స్వతంత్రంగా ఎదగాలని తాను కోరుకుంటే, అధిష్ఠానం మాత్రం ద్రావిడ పార్టీలపై ఆధారపడటాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, సీట్ల కేటాయింపులో అన్నామలై అభిప్రాయాలను కేంద్ర నాయకత్వం పక్కన పెట్టింది. తనకు కేవలం ఆరు స్థానాల బాధ్యతలు మాత్రమే అప్పగించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి చెందారు. ఫలితంగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ కేవలం ఒక్క స్థానానికే పరిమితం కావడం, పార్టీ ఘోర పరాజయం పాలుకావడంతో అన్నామలై వాదన నిజమైంది. బీజేపీలో తనకు తగినంత స్వేచ్ఛ, భవిష్యత్తు లేవని భావించిన ఆయన, సుదీర్ఘ చర్చల అనంతరం కమలం గూటి నుంచి బయటకు రావడమే ఉత్తమమని భావించారు.అన్నామలై రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదు, పైగా మరింత దూకుడు పెంచబోతున్నారు. రాబోయే ఉపఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా లేదా సరికొత్త వేదిక ద్వారా పోటీ చేసేందుకు ఆయన సన్నాహాలు చేసుకుంటున్నారు. రాబోయే 6 నుంచి 8 నెలల కాలంలో ఒక కొత్త ప్రాంతీయ పార్టీని స్థాపించే యోచనలో ఆయన ఉన్నారు. తమిళ అస్థిత్వం - జాతీయ దృక్పథం అనే సరికొత్త స్లోగన్‌తో, ఒక సెక్యులర్ ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేయడమే ఆయన తదుపరి కార్యాచరణగా తెలుస్తోంది. ప్రముఖ నటుడు విజయ్ రాజకీయ అరంగేట్రం చేసి ఘనవిజయం సాధించడంతో తమిళనాడు రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి.

## భారత్‌లో ఎబోలా కేసులు లేవు.. కానీ!: కేంద్రం కీలక అడ్వైజరీ

**న్యూఢిల్లీ,జూన్ 2(పిసిడబ్ల్యూ న్యూస్):**

గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చిన వారు లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించిన వారు తమ ఆరోగ్యాన్ని స్వయంగా పర్యవేక్షించుకోవాలని సూచించింది. ఎబోలా ప్రభావిత దేశాల్లో ప్రయాణించినవారు స్వీయ నిర్బంధంలోకి వెళ్ళాలని సూచించింది.జ్వరం, తీవ్రమైన బలహీనత, కండరాల నొప్పి, తలనొప్పి, గొంతునొప్పి, వాంతులు, విరేచనాలు, దద్దుర్లు లేదా కారణం లేకుండా రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరింది. ముందస్తు సమాచారంతో మీ ప్రాణాలను కాపాడుకోవడంతోపాటు వ్యాధి వ్యాప్తిని కూడా నిరోధించవచ్చని తెలిపింది. అధికారుల సాయం కోసం హెల్ప్ లైన్ నెంబర్ 1075కు కాల్ చేయాలని సూచించింది.డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ), ఉగాండా, దక్షిణ సూడాన్‌లలో కొత్త రకం ఎబోలా వైరస్ వ్యాప్తి చెందుతోంది.

## సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

**(మొదటి పేజీ తరువాయి)**

సన్మానం చేశారు.అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు అభివృద్ధి, సంక్షేమానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపేందుకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నో పాటలు రాశారని కేటీఆర్ గుర్తు చేశారు. ఉద్యమ ప్రస్థానంలో కేసీఆర్ అనేక పాత్రలు పోషించారని, తెలంగాణ సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో ముందుకు సాగి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. కేసీఆర్ జీవిత గాథపై సినిమా తీయాలని ఒక దర్శకుడు తనను కలిసిన సందర్భాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆలోచిద్దామని కేసీఆర్ చెప్పారని, తెలంగాణ ఆవిర్భావం అనేది అన్ని ప్రతికూల పరిస్థితులను ఛేదించి సాధించిన చారిత్రక విజయమని ఆ దర్శకుడు అభిప్రాయపడ్డారని తెలిపారు. కేసీఆర్ అనే మూడు అక్షరాల ముందు 'ముఖ్యమంత్రి' అనే పదవి చాలా చిన్నదిగా కనిపిస్తుందని ఆయన వ్యాఖ్యానించినట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్.. 'పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్కరుల తెలంగాణగా మారిపోయింది. నిష్ఫల తెలంగాణగా మారిపోయింది' అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం పదవిని మాత్రమే కాదు.. అవసరమైతే ప్రాణత్యాగానికీ సిద్ధపడ్డ నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యతో బాధపడిన ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించి వేలాది కుటుంబాల కష్టాలను తీర్చిన నాయకుడు కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొందరు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారని ఆరోపించారు.

## అమరవీరుల త్యాగాలు, దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటాలు

**(మొదటి పేజీ తరువాయి)**

వేసిన ప్రతి ఒక్కరినీ ఈ సందర్భంగా స్మరించుకోవాలని గవర్నర్ పిలుపునిచ్చారు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అనే సూక్తిని ప్రస్తావిస్తూ, జన్మభూమి స్వర్గం కంటే గొప్పదని పేర్కొన్నారు. తెలంగాణ శతాబ్దాల నాటి సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ వ్యవసాయ వారసత్వం రాష్ట్ర అసలైన జీవనాడిగా నిలిచాయని గవర్నర్ అన్నారు. కాకతీయుల కాలం నాటి గొలుసుకట్టు చెరువుల నుంచి నేటి ఆధునిక సాగునీటి ప్రాజెక్టుల వరకు రైతాంగం చేసిన కృషి తెలంగాణను సస్యశ్యామలం చేసిందని కొనియాడారు. వ్యవసాయ రంగంతో పాటు ఐటీ, ఫార్మా, స్టార్టప్ తదితర రంగాల్లో తెలంగాణ అంతర్జాతీయ గుర్తింపు సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలు, 'సర్వే భవంతు సుఖినః' అనే ఆదర్శ స్ఫూర్తితో గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం, నగరాల ఆధునికీకరణ సమపాళ్లలో సాగుతూ సుసంపన్న తెలంగాణ నిర్మాణం జరగాలని గవర్నర్ ఆకాంక్షించారు.తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించి దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించాలని గవర్నర్ ఆకాంక్షించారు. వేడుకల్లో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శ్రీ శశికిరణా చారి, లోక్ భవన్ అధికారులు, ఉద్యోగులు ,సిబ్బంది పాల్గొన్నారు.

## బంగారం రీసైకిల్ చేద్దాం : ప్రధాని మోదీ పిలుపు

**న్యూఢిల్లీ,జూన్ 2(పిసిడబ్ల్యూ న్యూస్):**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో దేశ విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు ఒక కీలక పిలుపునిచ్చారు. కొత్తగా బంగారం దిగుమతి చేసుకునే బదులుగా ఇళ్లలో, దేవాలయాల్లో నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని రీసైక్లింగ్ చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన సూచించారు.

ఈ విధానం ద్వారా బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ప్రధాని అభిప్రాయపడ్డారు.భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారం వినియోగదారుగా ఉన్నప్పటికీ, దేశీయంగా ఉత్పత్తి చాలా స్వల్పం. ఈ కారణంగా ఏటా బిలియన్ల కొద్దీ డాలర్లను వెచ్చించి బంగారాన్ని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో మన దేశం సుమారు 72.4 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఇది ముడి చమురు తర్వాత దేశ దిగుమతి బిల్లులో అతిపెద్దది. బంగారం దిగుమతులకు చెల్లింపులు యూఎస్ డాలర్లలో చేయాల్సి రావడం వల్ల, రూపాయి విలువపై ఒత్తిడి పెరిగి, కరెంట్ అకౌంట్ లోటు విస్తరిస్తోంది.ఈ సమస్యకు పరిష్కారంగానే ప్రధాని రీసైక్లింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. అంచనాల ప్రకారం ప్రస్తుతం దేశంలోని గృహాలు, దేవాలయాల్లో దాదాపు 30,000 నుంచి 32,000 టన్నుల బంగారం నిరుపయోగంగా ఉంది. ఈ పాత ఆభరణాలు, నాణేలు, మరియు ఇతర బంగారు వస్తువులను కరిగించి, శుద్ధి చేసి, 99.9% స్వచ్ఛమైన బంగారంగా మార్చవచ్చు. ఈ బంగారాన్ని తిరిగి కొత్త ఉత్పత్తుల తయారీకి ఉపయోగించడం వల్ల దిగుమతుల అవసరం తగ్గుతుంది.రీసైక్లింగ్ విధానం ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఉపయోగకరం

పరిశ్రమ నిపుణులు సైతం ప్రధాని ప్రతిపాదనను సమర్థిస్తున్నారు. ముత్తూట్ ఎగ్జిమ్ సీఈఓ కీయూర్ షా అంచనా ప్రకారం దేశంలో ఉన్న మొత్తం బంగారంలో కేవలం 1% ఏటా రీసైక్లింగ్‌కు వచ్చినా, మన దిగుమతులు 25 నుంచి 30 శాతం వరకు తగ్గుతాయి. స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ పరిశోధన హెడ్ సంతోష్ మీనా మాట్లాడుతూ, వ్యవస్థీకృత రీసైక్లింగ్ విధానం విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించడమే కాకుండా వాణిజ్య లోటును నియంత్రించి, దేశాన్ని ఆత్మనిర్భర్ దిశగా నడిపిస్తుందని వివరించారు.ప్రధాని పిలుపును జ్యువెలరీ సంఘాలు స్వాగతించాయి. పాత బంగారాన్ని మార్చుకునే వారికి తక్కువ తరుగుతో కొత్త డిజైన్లు అందించే కార్యక్రమాలను ఇప్పటికే ప్రారంభించాయి. మరోవైపు బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఉండటంతో వివాహాలు, ఉన్నత విద్య వంటి అవసరాల కోసం పాత నగలను మార్చుకోవడం వినియోగదారులకు కూడా లాభదాయకంగా మారింది. మొత్తంమీద దిగుమతి చేసుకునే వినియోగదారుగా కాకుండా, దేశంలో ఉన్న వనరులనే సమర్థంగా వాడుకునే ఆర్థిక వ్యవస్థగా మారాలనేది ఈ పిలుపు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.

## అకాల వర్షాలతో రైతులు కన్నీరు

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రకృతి కన్నెర్ర చేయడంతో స్వేదం చిందించి పండించిన ధాన్యం రాశులు కళ్ల ముందే తడిసిపోతుంటే ఆ దృశ్యాలు చూసి కర్షకులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విభిన్న వాతావరణ పరిస్థితులు జిల్లావ్యాప్తంగా రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.

కల్లాల్లో, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ధాన్యం విక్రయించడానికి వచ్చిన కర్షకులు చెప్పనలవికాని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో పగలు రాత్రి కష్టపడి సాధించిన దిగుబడులను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి మార్కెట్ యార్డుల్లోనే పడిగాపులు కాస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. కల్లాల వద్ద, రోడ్ల పక్కన కుప్పలు పోసిన ధాన్యం వర్షానికి తడవకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. రోడ్లపైనే వరి కుప్పలు భారీగా పేరుకుపోవడంతో అటు వాహనదారులకు సైతం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు.గత రెండు మూడు రోజులుగా విరామం లేకుండా కురుస్తున్న అకాల వర్షాలకు జిల్లాలోని సాత్నాల, బేలా, జైనథ్, భోరజ్ మండలాల్లో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మార్కెట్ కేంద్రాల వద్ద ఆరుబయట నిల్వ ఉంచిన ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు వాగుల్లా ప్రవహించడంతో వడ్లు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. ముఖ్యంగా తాంసి మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ ఆరబోసిన జొన్న పంటతో, నిస్సహాయ స్థితిలో ఉన్న రైతులతో కిటకిటలాడుతోంది. కంటికి రెప్పలా కాపాడుకున్న జొన్న కుప్పలు అడపాదడపా కురుస్తున్న వానలకు తడిసిపోతుండటంతో వాటిని పదేపదే ఎండబెట్టుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తూ అలిసిపోతున్నారు. కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగడానికి ప్రధానంగా గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీల కొరత కారణమని స్పష్టమవుతోంది. నిండిన బస్తాలను తరలించేందుకు లారీలు సకాలంలో రాకపోవడం, తూకాలు వేసేందుకు తగినంత మంది కూలీలు దొరకకపోవడంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం పదిహేను ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు.. ఇప్పటి వరకు సుమారు రెండు లక్షల క్వింటాళ్ల వరిని మాత్రమే కొనుగోలు చేయగలిగారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఏమాత్రం పరిష్కారం కాకపోవడంతో వారం రోజులు గడిచినా రైతుల నిరీక్షణ యథాతథంగా కొనసాగుతూనే ఉంది. బస్తాల కొరత అన్నదాతల పాలిట పెను శాపంగా మారింది. క్షణం క్షణం మారుతున్న వాతావరణ పరిస్థితులు, అధికారుల నిర్లక్ష్యం వెరసి రైతుల సహనాన్ని తీవ్రంగా పరీక్షిస్తున్నాయి. పగలు ఎండకు ఎండుతూ, రాత్రి వానకు తడుస్తూ దిక్కుతోచని స్థితిలో ఉన్న కర్షకులు చివరికి తమ ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల రోడ్డెక్కి ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. వాన ఎప్పుడు ముంచుకొస్తుందో, గాలి దుమారం ఎప్పుడు కమ్ముకొస్తుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో అధికారులు తక్షణమే స్పందించాలని వారు వేడుకుంటున్నారు. లారీలు, గోనెసంచులు తగినన్ని అందుబాటులో ఉంచి, నిబంధనలు సడలించి తడిసిన పంటను సైతం వెంటనే కొనుగోలు చేసి తమను తక్షణమే ఆదుకోవాలని రైతన్నలు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## ఇంకెంత కాలం ఆంధ్రావాళ్లను తిడతారు

**(మొదటి పేజీ తరువాయి)**

తెలంగాణను వ్యతిరేకించిన వారే.. పదవుల్లో ఉన్నారని.. ఎమ్మెల్యేలు అయ్యారని పవన్ కల్యాణ్ వివరించారు. తెలంగాణ అంటే గౌరవం ఉంది కనుకే కొండగట్టు ఆలయానికి కోట్ల రూపాయిలు విరాళంగా ఇచ్చామన్నారు. మీ తాటాకు చప్పుళ్లకు జనసేన పార్టీ భయపడదన్నారు. భయపడేవాడినే అయితే పార్టీ పెడతానా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ద్రోహం జరిగితే మొట్టమొదట గొంతులేపేది జనసేన పార్టీనే అని స్పష్టం చేశారు. ఏం చేసినా ఓట్ల కోసం కాదు.. తనకు తెలంగాణపై ప్రేమ, మమకారం ఉన్నాయన్నారు. గుంటూరులో టీఆర్‌ఎస్ కార్యాలయం పెడితే స్వాగతించామని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. ఇక్కడ ఏమైనా చేస్తే తాను సీఎం అయిపోతానా? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. తెలంగాణను తానెప్పుడు అవమానించానని ఆయన స్థానిక నేతలను ప్రశ్నించారు. తన పీక కోసినా కూడా భయపడేది లేదన్నారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టం లేదని తెలిపారు. తనను ఎన్ని తిట్టినా పట్టించుకోనన్నారు. తెలంగాణలో ఉపాధి లేకపోతే తాను కారణమా? అని రాజకీయ పార్టీల నాయకులను ఆయన సూటిగా నిలదీశారు. మద్రాస్‌లో ఉన్న చిత్రపరిశ్రమ ఇక్కడికి ఎలా వచ్చిందన్నారు. ఆంధ్రా వాళ్లను తిడుతుంటే వాళ్లు ఇక్కడెలా ఉంటారన్నారు. ఇంకెంతకాలం ఆంధ్రావాళ్లను తిడుతూ కాలక్షేపం చేస్తారంటూ తెలంగాణలోని నాయకులకు ఆయన సూటిగా ప్రశ్నించారు. సడెన్‌గా ఇక్కడికి రావొద్దంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో ఏపీ కాంట్రాక్టర్లు బాగానే ఉన్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తనకు గౌరవం ఉందన్నారు. తాను చెరువును కబ్జా చేశానని కొందరు అంటున్నారని.. అలా చేస్తే తనను ఇక్కడ ఉండనిస్తారా? అని ఆయన సూటిగా నిలదీశారు. తన ఫామ్‌హౌస్ కబ్జా అని తేలిస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వానికే రాసిస్తానన్నారు. గద్దర్‌తో తనకు చాలా సాన్నిహిత్యం ఉందని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందే తనకు గద్దర్ తెలుసునన్నారు. గద్దర్ ఒంట్లో బుల్లెట్లు దిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదని రాజకీయ పార్టీల నేతలను పవన్ కల్యాణ్ సూటిగా ప్రశ్నించారు. గద్దర్ తమ పార్టీ కార్యాలయానికి వచ్చేవారని గుర్తు చేశారు. గద్దర్ బతికున్నప్పుడు మీరంతా ఎక్కడున్నారు? అంటూ తనను ప్రశ్నిస్తున్న నేతలకు పవన్ కల్యాణ్ చురకలంటించారు.తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఉత్తేజం పొందామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతమైనదన్నారు. తెలంగాణపై తనకు కొత్తగా వచ్చిన ప్రేమ కాదని పేర్కొన్నారు. 13వ ఏట అడుగుపెడుతున్న తెలంగాణకు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష మందికిపైగా జనసేన నాయకులు, సైనికులు ఉన్న.. తెలంగాణలో కేడర్ తరఫున ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణలో జనసేన పార్టీ పుట్టిందని గుర్తు చేశారు. ఇక్కడి నాయకులంతా 2007-08 నుంచి.. అప్పటి యువరాజ్యంలో సభ్యులని వివరించారు. తెలంగాణ నలుమూలలా పెరిగిన వాడిని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణ బాగుండాలనే ఎప్పుడూ కోరుకున్నానని తెలిపారు. తన సినిమాల్లో తెలంగాణ స్ఫూర్తి కనిపిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ తాండాల్లో గడిపిన వాడిని.. ఆ తాండాల్లో దాహార్తి తీర్చిన వాడినని ఏపీ డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ విభజన తీరుకు తాము వ్యతిరేకమన్నారు. పార్లమెంట్ తలుపులు మూసి రాష్ట్ర విభజించిన తీరును ప్రశ్నించామని చెప్పారు. తనకు వారాహి యాత్రకు అనుమతి ఇచ్చింది తెలంగాణ అని వ్యాఖ్యానించారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మల్లంపల్లిలో ఘన వేడుకలు



**మండల మల్లంపల్లి మండల ప్రతినిధి జూన్ 2(పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు మాట్లాడుతూ, జూన్ 2, 2014న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకోవడం ప్రతి తెలంగాణ పౌరుడి బాధ్యత అని అన్నారు. వేలాది మంది అమరవీరుల త్యాగాలు, దశాబ్దాలపాటు సాగిన ఉద్యమం, విద్యార్థులు, మేధావులు, ప్రజల పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో "నిధులు నీళ్లు నియామకాలు" ప్రధాన నినాదాలుగా నిలిచాయని, ఆ ఆకాంక్షల సాధన కోసం ఎంతోమంది తమ ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా గ్రామ పంచాయతీ తరపున కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంకం సురేష్, వార్డు సభ్యులు గొల్లెల సారంగపాణి, చెన్నబోయిన కవిత మహేందర్, పాషా, జింక వేణు, పాలపర్తి రమాదేవి హనుమంతు, దయ్యాల కవిత చంద్రమౌళి, కొంగరి నరేందర్, గ్రామ కార్యదర్శి నిరంజన్ రెడ్డి, విటల్, ఏపీఓ సునీత, మల్లంపల్లి గ్రామ అధ్యక్షుడు రాము, జిల్లా కార్యదర్శి దేవేంద్రచారి, ముత్యాల వెంకన్న, గుండబోయిన చంద్రయ్య, వనమా వేణు, మనుము శీను, హైమద్ పాషా, గొర్రె కుమార్, కొలిపాక శ్రీనివాస్, కుడితాల విజేందర్, రామ్‌రెడ్డి, కక్కెర్ల సాంబయ్య, ల్యాద లక్ష్మణ్, షాపూర్ సుధాకర్, తాళ్లపల్లి సాంబయ్యతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. తెలంగాణ ఆవి ర్భావ దినోత్సవ వేడుకలు గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడ్డాయి.

# ప్రజా సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యత


## సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక

## అమరుల త్యాగఫలమే రాష్ట్ర ఆవిర్భావం

## కల్లూరులో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**కల్లూరు, జూన్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కల్లూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ చరిత్రను, దాని వెనుక ఉన్న త్యాగాలను స్మరించుకున్నారు. తెలంగాణ అనేది కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదని, ప్రజల ఆత్మగౌరవానికి, స్వాభిమానానికి ప్రతీక అని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం వేలాది మంది యువకులు, విద్యార్థులు, ఉద్యమకారులు తమ జీవితాలను అర్పించారని గుర్తు చేశారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం వెనుక ప్రధాన లక్ష్యం పేదలు, బలహీన వర్గాలు, అణగారిన ప్రజలకు న్యాయం చేయడమేనని ఆయన స్పష్టం చేశారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయాలని పేర్కొన్నారు. ప్రజలకు పారదర్శక పరిపాలన అందించడమే తన ప్రథమ లక్ష్యమని అజయ్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం, భూభారతి, సాదా బైనామా, మీ సేవ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామీణాభివృద్ధి, సాగునీటి రంగం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల విస్తరణలో విశేష పురోగతి సాధించిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర గొప్పతనాన్ని భావితరాలకు చాటిచెప్పాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## జెండా ఆవిష్కరించిన సర్పంచ్ గొడ్ల ప్రభాకర్





**తల్లాడ, జూన్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో అన్నారుగూడెం గ్రామంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ అధ్యక్షతన గ్రామపంచాయతీ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ పురస్కరించుకొని జాతీయ జెండాను గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ వాదాన్ని, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకు తెలంగాణ జాతిపిత కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా కవులు, గాయకులు, మేధావులు, యువకులు తమకున్న సర్వస్వాన్ని దారపోసి తెలంగాణ రాష్ట్ర సాధనకు శ్రమించారు అని తెలిపారు. ఎందరో ఆత్మ బలిదానాల శ్రమ ఫలితమే ఈనాడు స్వరాష్ట్ర సంకల్పం సహకార మయ్యిందని అమరుల ఆశయాలను ముందుకు తీసుకుపోయేందుకు ప్రతి ఒక్కరం పరస్పర సహకారంతో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ముందుకు నడవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో అశువులు బాసిన అమర వీరుల ఆశయాల సాక్షిగా అన్నారుగూడెం గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృత నిశ్చయంతో పనిచేస్తామని అన్నారు. ఈ మహా ప్రస్థానంలో ప్రతి ఒక్కరు భాగస్వాములవ్వాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, పంచాయతీ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, నాయకులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, బొమ్మ గాని నాదం, గోవిందు శ్రీనివాసరావు, ఆపతి వెంకట రామారావు, పులి వెంకట నరసయ్య, మారెళ్ళ దేవేందర్, పేరసాని నరసింహారావు, కందుల నారాయణ, షేక్ హుస్సేన్ బేగ్, తాళ్ల జోసెఫ్, గోవిందు సురేష్, పిన్ని హరీష్, ఓబిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కోసూరి వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, ఇస్నపల్లి శ్రీనివాసరావు, ఇస్నపల్లి గురవయ్య, ఇస్నపల్లి చిన్నకృష్ణ, గొడ్ల వెస్లీజియాన్, గొడ్ల మోసే, గొడ్ల పొన్నం, పంచాయతీ గుమస్తా రమేష్, అంగన్వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తలు, మల్టీపర్పస్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు

## - కరీంనగర్ పోలీస్ కమీషనర్ - గౌష్ ఆలం. ఐ.పి.యస్



**కరీంనగర్ టౌన్ జూన్ 02(పిసిడబ్ల్యూ న్యూస్):** కమీషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల దృష్ట్యా నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత ఏసీపీ ల నుంచి అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులను నిర్వహించకూడదని తెలిపారు. అనుమతులు లేకుండా ఎటువంటి సభలు సమావేశాలు,ర్యాలీలు నిర్వహించకూడదని సంబంధిత అధికారుల నుండి అనుమతులు తప్పనిసరి అని తెలిపారు అనుమతుల కోసం దరఖాస్తు చేయడం ద్వారా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అట్టి కార్యక్రమానికి తగిన విధంగా పోలీసు శాఖ భద్రతాపరమైన చర్యలు చేపడుతుంది అన్నారు. ఈ చట్టం అమలులో వుండగా ఇతరులను గాయపరిచే విధంగా ఉండే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించకూడదు. రోడ్లు, ప్రజలకు ఉపయోగపడే ఇతర స్థలాల్లో జనాన్ని సమీకరించకూడదు. జన సంచారం మరియు అనుమతి పత్రాలలో పేర్కొన్నబడిన ప్రాంతాలలో మ్యూజిక్ లు, పాటలు, ప్రసంగాలు, రణగొణ ధ్వనులు చేయవద్దని కోరారు. ఈ ఉత్తర్వులు ఈనెల 30 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ తెలిపారు.

# మల్లంపల్లిలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**మల్లంపల్లి మండల ప్రతినిధి జూన్ 2(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్లంపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు శ్రీ బైకాని మహేందర్ యాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి దోహదపడిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా వారి ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సంప్రదాయాలు మరియు ఆత్మగౌరవాన్ని పరిరక్షించుకోవడం ప్రతి తెలంగాణ పౌరుడి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు దండిగా వెంకన్న, బీజేవైఎం జిల్లా జనరల్ సెక్రటరీ కత్తి హరీష్ గౌడ్, గూడెల్లి కొంరెల్లి, ఎండిగా రాజు, గొట్టిముక్కుల నరేష్ శర్మ, కొండా యుగేందర్, బయ్యా రాజేందర్, పోతరాజు రమేష్, కంది రఘుపతి, గుంటుక సురేష్, మనోహర్ సామి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శ్రీనగర్ గ్రామంలో ఘనంగా జెండా ఆవిష్కరణ



**మల్లంపల్లి మండల ప్రతినిధి జూన్ 2(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీనగర్ గ్రామంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తెలంగాణ ఉద్యమ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దశాబ్దాల పాటు సాగిన తెలంగాణ ఉద్యమ ఫలితంగా 2014 జూన్ 2న ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు, విద్యార్థులు, మేధావులు మరియు ప్రజల త్యాగాలను గుర్తుచేసుకుంటూ, రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని పేర్కొన్నారు. అనంతరం జాతీయ పతాకానికి వందనం చేసి, తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువకులు, మహిళలు మరియు గ్రామ ప్రజలు పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం తమ వంతు కృషి కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# శివాయిగూడెంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**రఘునాథపాలెం,జూన్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రఘునాథపాలెం మండలం శివాయిగూడెం గ్రామంలో సోమవారం ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి సునీత గారు తెలంగాణ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాభివృద్ధి, గ్రామాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాధనలో అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శారద ,గ్రామ సెక్రటరీ రోజా,నంద్య లాలు, సైదా లక్ష్మణ్, పొనుగోటి లక్ష్మణ్, గార్లపాటి శీను, రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ భద్రు, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్నదానం మహా పుణ్యకార్యం: బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు



**హైదరాబాద్, జూన్ 02(పిసిడబ్ల్యూ న్యూస్):** అన్నదానం మహా పుణ్య కార్యమని బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ ఆర్ లక్ష్మణ్ రావు అన్నారు. అధిక మాసం మరియు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభ సందర్భంగా బజరంగ్ సేన సంయుక్త కార్యదర్శి సునీల్ అగర్వాల్ తల్లి దివంగత ప్రేమలాతా అగర్వాల్ ఆత్మీయ సంస్మరణార్థం, గౌలిగూడ లోని శ్రీ రామ్ మందిరంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ సేన బృంద సభ్యులు మనోజ్, సునీల్, శ్రీనివాస్, ఆకులారెడ్డి పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి బజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షులు ఎన్. ఆర్. లక్ష్మణ రావు నాయకత్వం వహించారు. ఆయనతో పాటు అంకితభావం గల బజరంగ్ సేన సభ్యులు భక్తులకు, సమాజానికి సేవ చేయడంలో మనస్ఫూర్తిగా పాల్గొన్నారు. దివంగత ప్రేమలాతా అగర్వాల్ మహోన్నత స్మృతికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం కరుణ, నిస్వార్థ సేవ , భక్తి విలువలను ప్రతిబింబించింది. ఆమె ఆత్మ సమాజానికి దయ, సేవా కార్యక్రమాలకు స్ఫూర్తినిస్తూనే ఉండాలని వారు ఆకాంక్షించారు.

PCW తెలుగు దినపత్రిక బుధవారం 03 జూన్ 2026

# ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- సిబ్బందికి ఘన సన్మానం
- ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్







**కల్లూరు, మే 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :**వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ ఆవిష్కరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నూతనంగా ఎన్నికైన కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోట్రు అర్జున్ రావు, కల్లూరు టౌన్ అధ్యక్షులు షేక్ ఉస్మాన్ ను శాలువాతో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కార్యాలయం కల్లూరు, పెనుబల్లి మండలాల సిబ్బందిని చైర్మన్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పార్టీ నాయకులు అందర్నీ కలుపుకొని సమన్వయంతో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, మున్సిపాలిటీ చైర్మన్ మోహన్, ఆర్యవైశ్య జిల్లా మహాసభ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అలకుంట నరసింహారావు, సీనియర్ నాయకులు పెద్ద పోయన శ్రీనివాసరావు, బైర్ల కాంతారావు, ఏఎంసీ డైరెక్టర్లు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కోటేశ్వరి, కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, యాస నాగమణి శ్రీకాంత్, దాసరి సుధారాణి, ఖమ్మంపాటి రాధా వీరస్వామి, భూక్య రాంబాయి, జిల్లెల్ల స్వాతి భాస్కర్ రెడ్డి, గుండ్ల పుల్లారావు మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా అమరవీరులకు టీఎంహెచ్చీ ఘన నివాళి

**ఖమ్మం, ప్రతినిధి జూన్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్చీ) ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద ఘన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీఎంహెచ్చీ రాష్ట్ర అధ్యక్షులు, దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు ఎన్నటికీ మరువలేనివని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలైన నిధులు, నియామకాలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు, ఉపాధి కల్పన వంటి



అంశాల్లో వరుస ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో న్యాయం చేయలేదని విమర్శించారు. భౌగోళిక తెలంగాణ సాధించినప్పటికీ సామాజిక తెలంగాణ సాధన ఇంకా మిగిలి ఉందని, దళితులు, బడుగు బలహీన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రజలంతా ఏకమై పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. అమరవీరుల ఆశయాల సాధనే వారికి నిజమైన నివాళి



అని అన్నారు. టీఎంహెచ్చీ నగర అధ్యక్షులు కుక్కల రామకృష్ణ (ఆర్కే), నగర కార్యదర్శి పగిడి ముక్కుల విజయకుమార్, రఘునాథపాలెం మండల అధ్యక్షులు కాంపాటి ఉపేందర్, కంచర్ల శ్రీనివాస్, వెంకన్న, తెలంగాణ ఉద్యమకారులు శ్రీహరి, చిర్రా రవి, తెలంగాణ శ్రీను, దేవిరెడ్డి విజయ్, ప్రభాకర్ చారి, అంబేద్కర్ నాగరాజు, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, బిక్షం తదితరులు పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని వివరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**కరీంనగర్ జిల్లా జూన్2(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తూ, వారి త్యాగాల ఫలితంగానే నేటి తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం పారదర్శక పాలన, సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తెలంగాణను ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్-2047" దిశానిర్దేశక పత్రాన్ని రూపొందించిందని తెలిపారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 3,506 ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి, 2,913 పెండింగ్ ఫైళ్లను పరిష్కరించినట్లు చెప్పారు. జిల్లా యంత్రాంగం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 78 కంపెనీలు పాల్గొని 292 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాయని వెల్లడించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, జిల్లాలో లక్షా 58 వేల మందికి రూ.500కే గ్యాస్ సిలిండర్లు అందించినట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులు జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. రైతు భరోసా పథకం ద్వారా జిల్లాలో లక్షా 93 వేల మందికి పైగా రైతులకు రూ.143 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందించామని, రైతు





బీమా పథకం కింద 267 మంది రైతు కుటుంబాలకు రూ.13.35 కోట్ల పరిహారం చెల్లించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జిల్లాలో 10,114 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, 7,076 ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే 2,081 కుటుంబాలు గృహప్రవేశం పూర్తి చేసుకుని తమ స్వగృహాల్లో నివసిస్తున్నట్లు వెల్లడించారు. రబీ సీజన్‌లో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా 2.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.554 కోట్లను జమ చేసినట్లు తెలిపారు. అలాగే జిల్లాలో 45,920 కొత్త రేషన్ కార్డులు జారీ చేసి, 96,775 మంది కుటుంబ సభ్యులను రేషన్ కార్డుల్లో చేర్చినట్లు పేర్కొన్నారు. విద్యారంగంలో జిల్లాలో ఎస్ఎస్‌సీ పరీక్షల్లో 98.57 శాతం ఉత్తీర్ణత నమోదైందని, విద్యార్థుల





నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాల ద్వారా వేలాది మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. కళ్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక సాయం అందించగా, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద జిల్లాలో 52 వేల మందికి పైగా ఉచిత వైద్య సేవలు అందించినట్లు మంత్రి వివరించారు. చివరగా జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, తెలంగాణ ఉద్యమకారులు, జర్నలిస్టులు మరియు జిల్లా ప్రజలందరికీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# కరీంనగర్ కొత్త డీఆర్వోగా జే స్వామి బాధ్యతల స్వీకరణ

**- కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీఆర్వో...**



**కరీంనగర్ టౌన్ జూన్2(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కొత్త జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా జే స్వామి శనివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయనకు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జే స్వామికి ప్రభుత్వం ఇటీవల పదోన్నతి కల్పించింది. ఈ క్రమంలో ఆయనను కరీంనగర్ జిల్లా డీఆర్వోగా నియమించింది. నియామక ఉత్తర్వుల మేరకు ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. జిల్లా అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తానని ఈ సందర్భంగా జే స్వామి తెలిపారు. నూతన డీఆర్వోను కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు అభినందించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో)తో పాటు కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌కు చెందిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# టీజీపీఎస్సీ నుంచి రేపు 3 కొత్త నోటిఫికేషన్లు

**- 3,800 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి: చైర్మన్ వెంకటేశం**




**హైదరాబాద్ జూన్2(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నుంచి రేపు మూడు కొత్త నియామక నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు చైర్మన్ వెంకటేశం తెలిపారు. ప్రస్తుతం వివిధ శాఖల్లో సింగిల్ పోస్టు కేటగిరీలో 25 ఖాళీలు ఉన్నాయని, వాటి భర్తీ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 3,800 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చిందని వెల్లడించారు. ఈ నెలలోనే మరిన్ని నియామక నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. అటవీ శాఖలో 3,093 పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రక్రియ కూడా త్వరలో ప్రారంభమవుతుందని వెంకటేశం తెలిపారు. నియామక ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించబడుతుం దని స్పష్టం చేశారు. యూపీఎస్సీ తరహాలో అభ్యర్థుల ప్రతిభను మరింత సమర్థవంతంగా అంచనా వేసే విధంగా "ప్రతిభా భారతి" కార్యక్రమాన్ని తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్ర యువతకు నాణ్యమైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే టీజీపీఎస్సీ లక్ష్యమని చెప్పారు. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్ల కోసం టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌ను నిరంతరం పరిశీలించాలని, నియామక ప్రక్రియకు అవసరమైన సన్నాహాలు ముందుగానే పూర్తి చేసుకోవాలని సూచించారు.

# సొసైటీలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కల్లూరు, జూన్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో చెన్నూరు గ్రామశీలో సొసైటీ కార్యాలయము నందు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాలేపు రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొని జండా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలు అర్పించిన వారి యొక్క స్ఫూర్తిని కొనియాడుతూ తెలంగాణ ఉద్యమంలో భాగమైన ప్రతి ఒక్కరినీ వారి యొక్క ఘనతలను గుర్తు చేసుకోవడం, స్వరాష్ట్ర సాధన కోసం అమరులైన వారి త్యాగాలను గుర్తుచేసుకొని ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో చెన్నూరు గ్రామ సర్పంచ్ జినుగు శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్లు, వార్డ్ మెంబర్లు జాల వెంకటకృష్ణ , సంగేపు శ్రీనివాసరావు, చెన్నూర్ సొసైటీ పరిధిలోని రైతులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కల్లూరు, జూన్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ ధరావత్ మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి రాష్ట్ర ఆవిర్భావ అమరవీరులకు నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది యువకులు, విద్యార్థులు, ప్రజలు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తమ ప్రాంతాన్ని తామే పరిపాలించుకోవాలని, తమ నిధులను తమ అభివృద్ధికి వినియోగించుకోవాలనే ఆకాంక్షతో జరిగిన ఉద్యమం ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సహకరించిన కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సూచనల మేరకు కల్లూరు మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, బిఆర్ఎస్ యువజన మండల అధ్యక్షులు న్యూ ప్రతాప్ ల్యాబ్ అధినేత, 18 వార్డ్ కౌన్సిలర్ పెడగంటి రామకృష్ణ, మాజీ జెడ్పిటిసిలు లక్కినేని రఘు, మేకల కృష్ణ, మాజీ సర్పంచ్ లక్కినేని కృష్ణ, పెద్ద బోయిన లక్ష్మీనరసింహారావు, ఎండి ఇస్మాయిల్, ఉబ్బన రాంబాబు, యాస నాగమణి శ్రీకాంత్, ఖమ్మంపాటి రాధా వీరస్వామి, భూక్య రాంబాయి, దాసరి సుధారాణి, జిల్లెల్ల భాస్కర్ రెడ్డి, గుండ్ల పుల్లారావు, సీనియర్ నాయకులు పెద్ద పోయన శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు ఉస్మాన్, బైర్ల కాంతారావు, కర్ణాటి అప్పిరెడ్డి, క్రాంతి ట్రాన్స్పోర్ట్ రెడ్డి, కుంచాల గురవయ్య, ఎండి అయూబ్, మున్సిపల్ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరావు, అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



# కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి హాజరు**

**జాతీయ పతాక ఆవిష్కరణ చేసిన డీసీసీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం**

**జాతీయ గీతం, తెలంగాణ గీతం ఆలపించిన కాంగ్రెస్ శ్రేణులు**

**2004లో కరీంనగర్ సాక్షిగా ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న సోనియాగాంధీ**

**తెలంగాణ ఉన్నంతవరకు సోనియా గాంధీ పేరు చిరస్థాయిగా నిలిచి ఉంటుంది: డా. మేడిపల్లి సత్యం**

**సోనియా గాంధీకి తెలంగాణ ప్రజల పక్షాన కృతజ్ఞతలు: డీసీసీ చీఫ్ మేడిపల్లి సత్యం**








**కరీంనగర్ టౌన్ జూన్ 02(పిసిడబ్ల్యూ న్యూస్):** నేడు జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే, తెలంగాణ ఎస్సీ విభాగం చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, జిల్లా ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం పార్టీ శ్రేణుల సమక్షంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాకు వందనం చేస్తూ తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. "2004 తెలంగాణ శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత శ్రీమతి సోనియా గాంధీ కరీంనగర్ సాక్షిగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్ర పెత్తందారులు, కొన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించినప్పటికీ, తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించి ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఇచ్చారు. నేడు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజల పక్షాన ఆమెకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. తెలంగాణ ఉన్నంతవరకు సోనియా గాంధీ పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది" అని అన్నారు. "గతంలో అనేక పార్టీలు మభ్యపెట్టినా, 2000 సంవత్సరంలో 3 రాష్ట్రాలు ఏర్పాటు చేసిన బీజేపీ తెలంగాణపై వివక్ష చూపింది. కానీ సోనియా గాంధీ మాత్రం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో.. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసయ్య , ఉప్పుల అంజని ప్రసాద్, పులి ఆంజనేయులు గౌడ్, మడుపు మోహన్, పత్తి మధుకర్ రెడ్డి, శ్రావణ్ నాయక్, ఆకారపు భాస్కర్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, గడ్డం విలాస్ రెడ్డి, వెన్నం రజిత రెడ్డి, విక్టర్, గంట శ్రీనివాస్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, వెన్న రాజమల్లయ్య, కామ్ రెడ్డి రామ్ రెడ్డి, చర్ల పద్మ, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, గడప శ్రీనివాస్, శ్రీరాముల రమేష్, మాదాసు శ్రీనివాస్, లింగంపల్లి బాబు, కుంభాల రాజ్ కుమార్, చాంద్, శిల్ప, పొరండ్ల రమేష్, కర్రె పావని, సిరిపురం నాగప్రసాద్, సాయిని తిరుపతి, కంకణాల జగదీశ్వర్ రెడ్డి, పెంట శేఖర్, చింతల కిషన్, మూల జైపాల్, హాజీ, బత్తిని చంద్రయ్య గౌడ్, మాలోతు మహాలక్ష్మి, షబానా, దండు రవీందర్, సుదర్శన్, బత్తిని రాజ్ కుమార్, పంజాల స్వామి గౌడ్, ఫజల్, జొన్నల రమేష్, మురళి న్యూస్, హసీనా, నూనె గోపాల్ రెడ్డి, కోట శంకర్, ఆవారు లత, రూపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మామిడి సత్యనారాయణ రెడ్డి, పడి శెట్టి భూమయ్య, మీసా రమాదేవి, బండి శరణ్య, గడ్డం శ్రీరామ్, రాచర్ల పద్మ, పెద్దెల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

---

## తెలంగాణ కలను సాకారం చేసిన మహానేత కేసీఆర్

- **కెసిఆర్ పాత్ర సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుంది**
- **అమరవీరుల త్యాగం కెసిఆర్ నాయకత్వం ఫలితమే తెలంగాణ రాష్ట్రం**
- **ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**



**కల్లూరు, జూన్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని యర్రబోయినపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామ సర్పంచ్ పోట్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులకు నివాళులర్పించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోట్రు శ్రీనివాసరావు మాట్లాడుతూ దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను సాకారం చేయడంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. తెలంగాణ కోసం సాగిన ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచి, లక్షలాది మంది ఆశయాలను నెరవేర్చిన నాయకుడిగా కేసీఆర్ పేరు తరతరాలకు గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గ్రామీణాభివృద్ధి, సాగునీరు, సంక్షేమం, మౌలిక సదుపాయాల రంగాల్లో రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల త్యాగాలను ఎన్నటికీ మరువలేమని, వారి ఆశయాల సాధనే వారికి నిజమైన నివాళి అని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించి దేశానికి ఆదర్శ రాష్ట్రంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అమరుల ఆశయాలే తెలంగాణకు దిక్సూచి: డాక్టర్ బి.వి చారి



**ఉప్పల్ జూన్ 02 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రం అమరవీరుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షలు, ఉద్యమకారుల పోరాట ఫలితమని బీఆర్ఎస్ పార్టీ వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ బి.వి చారి అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ లో గుడిసె హోటల్ వద్ద ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 ఏళ్ల ఉద్యమంలో నిరాహార దీక్షలు, రాస్తారోకోలు, రైల్‌రోకోలు, బంద్‌లు, అరెస్టులు, మిలియన్ మార్చ్‌లు, సాగరహారాలతో తెలంగాణ సాధన కోసం ప్రజలు పోరాడారని గుర్తు చేశారు. కేసీఆర్ ఆమరణ దీక్ష ఉద్యమానికి దిశానిర్దేశం చేసిందని, అమరవీరుల త్యాగాలు రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించాయని పేర్కొన్నారు. అమరుల ఆశయాల సాధనకు బీఆర్ఎస్ కట్టుబడి ఉందని తెలిపారు. ఉద్యమంలో పాల్గొన్న కార్యకర్తలు, ఉద్యమకారులకు వందనాలు తెలియజేశారు. కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇప్పటికి ప్రజలు మర్చిపోలేదని రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, స్వామి బొల్లెపల్లి, యాకాంతరావు, గణేష్ నేత, బాలకృష్ణ, దినేష్ చెట్టుకూరి, మద్దూరి శ్రీనివాస్, హరీష్ చారి, సాగర్, లక్ష్మణ్, అక్బర్, వీరయ్య, అనిల్ గౌడ్, పాండు రంగారెడ్డి, కిషోర్, ఇస్తారి, రాజు ,రమేష్ గౌడ్, రవీందర్, మహిళా నాయకురాలు రాధమ్మ, భాగ్యలక్ష్మి, రాజ్యలక్ష్మి, లతారెడ్డి, ఐశ్వర్య, రాధిక, నవనీత, మంజుల, మమత కాలనీ వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

---

# ఇసుక రవాణాకు కొత్త నిబంధనలు

**జిల్లా యంత్రాంగం నిర్ణయించిన ధరలు**

**నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తే**

**పోలీసులకు సమాచారం ఇవ్వండి**



**చిట్యాల, జూన్ 2 (పీసీడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల పరిధిలోని ఇసుక క్వారీల నుండి ఇసుక రవాణా చేసే వాహనదారులకు జిల్లా యంత్రాంగం కీలక ఆదేశాలు జారీ చేసింది. చిట్యాల తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్ఓ వసంత్ రావు, ఎంపీడీఓ జయశ్రీ, ఏఎంవిఐ తహిమ సుల్తానా, మరియు ఎస్సై సతీష్ సంయుక్తంగా సమావేశం నిర్వహించి కొత్త నిబంధనలను ప్రకటించారు. ముఖ్యమైన మార్పులు & రిజిస్ట్రేషన్. పాత 'ఇందిరమ్మ కూపన్లు' స్థానం లో వీ=ా ఆఫీసు నమోదు చేసుకోవాలి ట్రాక్టర్ యజమానులు తహసీల్దార్ కార్యాలయంలో ఇంజన్ నంబరు, ట్రాలీ నంబరు, ఇన్సూరెన్స్ మరియు డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలతో నమోదు చేసుకోవాలి.. రిజిస్ట్రేషన్ చేసుకున్న ట్రాక్టర్స్ కి మాత్రమే అనుమతికేవలం భూపాలపల్లి నియోజకవర్గం పరిధిలో మాత్రమే రవాణాకు అనుమతి. ఉదయం 6:00 నుండి సాయంత్రం 6:00 వరకు మాత్రమే రవాణా చేయాలి. ప్రభుత్వ సెలవు రోజుల్లో రవాణా పూర్తిగా నిషేధం. ఇసుకనుడంప్ చేయరాదు, లారీలో రావణ చేయరాదునిర్ణయించిన ధరల వివరాలు (ట్రాక్టర్ కు):గోరీకొత్తపల్లి మండల గ్రామాలు: రూ. 4,000. రేగొండ, భూపాలపల్లి, ఘనపూర్ మండలాలు: రూ. 3,500. చిట్యాల మండలం: రూ. 2,200. టేకుమట్ల, మొగుళ్ళపల్లి మండలాలు: రూ. 2,00 ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేసినా, పత్రాలు లేకుండా రవాణా చేసినా వాహనాలను సీజ్ చేసి కఠినమైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని చిట్యాల ఎస్ఐ సతీష్ హెచ్చరించారు. ప్రజలు జిల్లా యంత్రాం గం సూచించిన ధరలు కంటే ఎవరైనా ఎక్కువ తీసుకుంటే పోలీస్ లకి సంచారం ఇవ్వాలని తెలిపారు

---

# రైతుల మన్నలను పొందిన ఏఈవో హసీనా బేగం.

**ఆమె సేవలను కొనియాడిన సర్పంచ్, ఉప సర్పంచ్.**

**ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు.. హసీనా**







**తల్లాడ, జూన్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విధి నిర్వహణలో ఎటువంటి మచ్చ లేకుండా అంకితభావంతో, సేవాగుణంతో పనిచేసిన హసీనాబేగం గ్రామ రైతుల మన్నలను పొందారని గ్రామ సర్పంచ్ గొర్ల ప్రభాకర్, ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు కొనియాడారు. మండల పరిధిలో అన్నారుగూడెం ఏఈఓగా పనిచేసి బదిలీపై మల్లవరంకు వెళ్ళిన ఆమెను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ రైతు ఆపతి వెంకట రామారావు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్క రైతును పేరు పెట్టి పిలిచి వారి సమస్యలు పరిష్కరించేంత సన్నిహిత్యం ఏర్పడిందన్నారు. గ్రామంలో సుమారు 8 ఏళ్ల పాటు సుదీర్ఘంగా సేవలందించడం అభినందనీయమన్నారు. గ్రామంలో సుదీర్ఘకాలం పనిచేసిన అధికారిగా ఆమె ప్రత్యేక గుర్తింపు సాధించారని, ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మిగతావారు పనిచేయాలని సూచించారు. అనంతరం ఏఈఓ హసీనా మాట్లాడుతూ గ్రామ నాయకులు, రైతులు తనకు ఎంతో సహకరించారని, వారు సహకరించటం వల్లే సుదీర్ఘకాలం పని చేశానని తెలిపారు. ఇప్పటివరకు తనకు అండగా ఉన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాయికుమార్, వార్డు మెంబర్లు గడేసుల ఆనందరావు, గొర్ల సునీత, కోపెల లక్ష్మి, పావురాల శ్రీలత, రైతులు మారెళ్ళ దేవేంద్రరావు, గోవిందు శ్రీనివాసరావు ట్రాక్టర్, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, పులి వెంకట నరసయ్య, తాళ్ల అగస్టీన్, కందుల నారాయణ, పాల్గొన్నారు.

---

## జర్నలిస్ట్ కూరకుల గోపి మృతి పట్ల మంత్రి పొంగులేటి దిగ్భ్రాంతి




**ఖమ్మం ప్రతినిధి, జూన్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి, 'జనంసాక్షి' బ్యూరో ఇన్‌చార్జి, సీనియర్ జర్నలిస్ట్ కూరకుల గోపి ఆకస్మిక మృతి పట్ల తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం తీవ్ర ఛాతీ నొప్పితో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గోపి మరణవార్త తెలుసుకున్న మంత్రి పొంగులేటి తీవ్ర విచారాన్ని వ్యక్తపరుస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. జర్నలిజం రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న గోపి మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు సద్గతులు కలగాలని, శోకసంతప్త కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జర్నలిస్ట్ గోపి కుటుంబానికి తాము అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

# గోపీ మృతి పాత్రికేయ వృత్తికి తీరని లోటు

**టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ సంతాపం**

**పాడే మోసి ఘన నివాళులు అర్పించిన ఫెడరేషన్ జర్నలిస్టులు**







**ఖమ్మం ప్రతినిధి, జూన్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి కూరాకుల గోపీ మృతి పాత్రికేయ వృత్తికి తీరని లోటని ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. మంగళవారం ఉదయం ఆకస్మికంగా అనారోగ్యం పాలైన ఆయన్ను టీడబ్ల్యూజేఎఫ్ నేతల సహకారంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఖమ్మంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. అత్యవసర చికిత్స అందుతుండగానే బీపీ రికార్డు నమోదు కాకపోవటం, కార్డియాక్ అరెస్ట్, డయాబెటిక్ పేషెంట్ అయిన ఆయనకు కాలికి గాయంతో ఇన్ఫెక్షన్ శరీరమంతా వ్యాప్తి చెందటంతో తుదిశ్వాస విడిచారు. గతంలో వివిధ పత్రికలు, చానల్స్ లో రిపోర్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం జనంసాక్షి దినపత్రిక ఖమ్మం జిల్లా బ్యూరో ఇన్ చార్జిగా పనిచేస్తున్నారు. నిరంతరం జర్నలిస్టుల సంక్షేమం, సమాజ శ్రేయస్సు కోసం పనిచేసే గోపీ అకాల మృతి తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, టీబీజేఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవికిరణ్ లు అన్నారు. కూరాకుల గోపి స్వగ్రామం రఘునాధపాలెం మండలం, పాపటపల్లి గ్రామంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు గోపి అంతిమయాత్రలో పాల్గొని పాడే మోసి తమ స్నేహ బంధాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు తురగ రాజేంద్రమూర్తి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ మధుశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు కొత్త యాకేష్, జానీపాష, నూకల రామచంద్ర మూర్తి, కొమిరె నాగేశ్వరరావు, సంతోష్ చక్రవర్తి, ఇర్షాద్, కామళ్ల వెంకట్, టీబీజేఏ నాయకులు గణేష్, అర్షద్, గోపి, కిరణ్, తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు. గోపీకి భార్య క్రాంతి, ఇద్దరు కుమార్తెలు తేజస్విని, యశస్విని ఉన్నారు.

**టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సంతాపం**

సీనియర్ జర్నలిస్టు కూరాకుల గోపీ మృతికి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అడ్ హక్ కమిటీ ఓ ప్రకటనలో సంతాపం తెలిపింది. కమిటీ అధ్యక్షుడు రామచందర్, ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య, కార్యదర్శులు రాజశేఖర్, చంద్రశేఖర్, గుడిగే రఘు తదితరులు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

# సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పెరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండా ఆవిష్కరణ చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గీతే అడిషనల్ కలెక్టర్ నగేష్



**సిరిసిల్ల జూన్ 02(పిసిడబ్ల్యూ న్యూస్):** స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించిన ఆది శ్రీనివాస్, వారి త్యాగాల ఫలితంగానే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు.ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కింద జిల్లాలో 99 రోజుల కార్యాచరణ విజయవంతంగా కొనసాగుతోందని, గ్రామ సభల నుంచి జిల్లా స్థాయి సమావేశాల వరకు ప్రజల భాగస్వామ్యంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని, వేలాది కుటుంబాల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తోందన్నారు.సిరిసిల్ల నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించేందుకు భారీ స్థాయిలో వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు కేటాయించామని, దీని ద్వారా వేలాది కార్మికులకు ఉపాధి లభిస్తోందని పేర్కొన్నారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి వందల కోట్ల రూపాయలతో పనులు కొనసాగుతున్నాయని, ఆలయ పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు.రైతు భరోసా, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, గృహజ్యోతి, రూ.500 గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని వెల్లడించారు.విద్య, వైద్యం, సాగునీరు, రహదారులు, పరిశ్రమలు, మహిళా సాధికారత రంగాల్లో ప్రభుత్వం విస్తృతంగా పెట్టుబడులు పెడుతోందని పేర్కొన్నారు.జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపిన ఆది శ్రీనివాస్, ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాలు ఎగరవేసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం..



**మానకొండూర్ జూన్ 2(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో జాతీయ జెండాతో పాటు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జెండాను ఘనంగా ఎగరవేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా చైర్మన్ కుమారస్వామి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు పడిగల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఉద్యమకారులు, మేధావులు మరియు 1200 మంది అమరవీరుల త్యాగాల ఫలితంగా సాధ్యమైందన్నారు. అమరవీరులు కలలుగన్న తెలంగాణ ఆకాంక్షలు నెరవేరాలంటే అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమకారులు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జెండా పండుగగా జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను చేర్చడం కొంత ఉపశమనం కలిగించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కేకే కమిటీ కాలయాపన చేయకుండా ప్రతి తెలంగాణ ఉద్యమకారుడిని గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యమకారునికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు పడిగల రవీందర్ రెడ్డి, గరిక కోటేశ్వర్, గాజుల శ్రీనివాస్ గౌడ్, మానకొండూర్ మండల అధ్యక్షుడు గోశెట్టి సంజీవ్, గడ్డం సంపత్, బండారి కుమార్, బూడిద వినోద్ కుమార్, కోనమల్ల మల్లేశం, కోమల సత్యశంకర్, మొగిలి, బొంతల సంపత్, హుడి బాబా, భూమేష్, కన్నబోయిన రవి, మహిళా ఉపాధ్యక్షురాలు మేకల మాధవి, ఉత్తర తెలంగాణ మహిళా అధ్యక్షురాలు కారుపాకల లత, ఘర్షకుర్తి ఉమారాణి, మహదేవుని భార్గవి, భాగ్యలక్ష్మి, బాలామణి, వనజ, శారద, సుజాత రెడ్డి, సత్య, గౌరీ, విజయ, కవిత, దేవేందర్ రెడ్డి, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల కలలు 'బహుజన రాజ్యాధికారం' కావాలి!

- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సాక్షిగా బిఎస్పి శ్రేణుల సంకల్పం
- భౌతిక తెలంగాణ వచ్చింది... సామాజిక తెలంగాణ రావాల్సి ఉంది
- బీఎస్పీ జోనల్ ఇంచార్జ్ కర్రీ కృష్ణ, ఖమ్మం జిల్లా అధ్యక్షులు చెరుకుపల్లి నాగేశ్వరరావు



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 02 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ ఉద్యమ అమరవీరులు ఏ ఆశయాల కోసమైతే తమ ప్రాణాలను త్యాగం చేశారో, ఆ కలలు నిజమవ్వాలంటే రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం రావాలని బహుజన్ సమాజ్ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఖమ్మం నగరంలోని బాబాసాహెబ్ డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, చేతులు జోడించి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ జోనల్ ఇంచార్జ్ కర్రీ కృష్ణ, ఖమ్మం జిల్లా అధ్యక్షులు చెరుకుపల్లి నాగేశ్వరరావు సంయుక్తంగా మాట్లాడుతూ... చిన్న రాష్ట్రాల ఏర్పాటు ద్వారానే ప్రజలకు సంపూర్ణ పరిపాలనా ఫలాలు అందుతాయని నమ్మిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 వల్లే నేడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని గుర్తుచేశారు.**నాడే మద్దతు ఇచ్చిన మాయావతి..**తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జాతీయ స్థాయిలో బిఎస్పీ పోషించిన పాత్రను వారు ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు. నాటి ఉద్యమ సమయంలో, పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ఆమోదం పొందడం కోసం జాతీయ పార్టీలలో కేవలం బహుజన్ సమాజ్ పార్టీ మాత్రమే నిలబడిందని చెప్పారు. పార్టీ అధినేత్రి కుమారి మాయావతి గారు నాడే 39 మంది ఎంపీల మద్దతు లేఖను ప్రణబ్ ముఖర్జీ కమిటీకి అందించి తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అండగా నిలిచారని స్పష్టం చేశారు."మనం పోరాడి సాధించుకున్నది కేవలం భౌతిక తెలంగాణ మాత్రమే. నిజమైన, సబ్బండ వర్గాల 'బహుజన తెలంగాణ' ఇంకా సిద్ధించలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అంతా ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్నప్పుడే, అమరవీరుల ఆత్మలకు నిజమైన శాంతి లభిస్తుందని అన్నారు. రాష్ట్ర సాధనలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, వారి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు.ఈ భావోద్వేగభరిత కార్యక్రమంలో బీఎస్పీ మాజీ రాష్ట్ర కార్యదర్శి పల్లెపొంగు విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి మట్టే నాగేశ్వరరావు, ఖమ్మం అసెంబ్లీ అధ్యక్షులు నల్లగట్ల సతీష్, పాలేరు నియోజకవర్గ అధ్యక్షులు రమేష్ యాదవ్, వైరా నియోజకవర్గ అధ్యక్షులు మంద అర్జున్ రావు, కొమ్ము పూలే, ఊటుకూరి నాగేశ్వరరావు, చేకూరి సత్యనారాయణ, సి.హెచ్. వీరు సాహు, శ్రీకాంత్, ప్రవీణ్, సంతోష్, గోపి, ఉపేందర్, భరత్ తదితరులు అమరవీరుల స్మరణలో భాగస్వాములయ్యారు.

# అమరవీరుల త్యాగాల పునాదులపైనే నవ తెలంగాణ నిర్మాణం!







**- ఖమ్మం గెజిటెడ్ భవన్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు**

**- అమరుల ఆశయాల సాధనలో ఉద్యోగులు భాగస్వాములు కావాలి**

**- తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవోస్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొంగర వెంకటేశ్వరరావు, మోదుగు వేలాద్రి**

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అమరవీరుల త్యాగాల పునాదులపైనే నేడు నవ తెలంగాణ నిర్మాణం జరుగుతోందని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవోస్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొంగర వెంకటేశ్వరరావు, మోదుగు వేలాద్రి ఘనంగా చాటిచెప్పారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక గెజిటెడ్ భవన్‌లో జిల్లా శాఖ ఆధ్వర్యంలో వేడుకలను అత్యంత వైభవంగా, భావోద్వేగభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించి, అమరవీరుల సంస్మరణార్థం ఉద్యమ అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నాటి ఉద్యమకారుల అంకితభావం, నిరుపమాన త్యాగాల వల్లే నేడు మనం స్వరాష్ట్రంలో స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగానే నేడు తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతూ, దేశానికే ఆదర్శంగా నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. **చైతన్యానికి ప్రతీక ఖమ్మం గడ్డ..**జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి మాట్లాడుతూ.. తొలి, మలిదశ ఉద్యమాల్లో ఖమ్మం జిల్లా పోషించిన పాత్ర చారిత్రాత్మకమైనదన్నారు. ఇక్కడి ప్రజల, ఉద్యోగుల ఉద్యమ చైతన్యం రాష్ట్ర సాధనలో ఒక మైలురాయిగా నిలిచిందని గుర్తుచేశారు. సకల జనులు, సబండ వర్గాలు ఏకతాటిపైకి వచ్చి పోరాడి సాధించుకున్న తెలంగాణలో.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ప్రభుత్వ ఉద్యోగులు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు." పరిపాలనా సామర్థ్యాన్ని పెంచుతూ, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను నిరుపేదల దరిచేర్చడంలో గెజిటెడ్ అధికారులు నిబద్ధతతో పనిచేస్తున్నారు. నాటి ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థుల త్యాగాలు, ఉద్యమ శ్రమ ఎప్పటికీ మరువలేనివని జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి అన్నారు.రాష్ట్రం మరింత ప్రగతి పథంలో పయనించాలని, ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలందరికీ వారు అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో భాగంగా గెజిటెడ్ భవన్ ప్రాంగణం ఉద్యమ స్మృతులతో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో టీజీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేష ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి. విజయ్ కుమార్, జిల్లా కోశాధికారి సూరంపల్లి రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ హరీష్, కిషోర్ బాబు, డాక్టర్ బి. శ్రీనివాస్, కిరణ్ కుమార్, కార్తీక్, సూజిత్ రెడ్డి, సరిత, జి.వి.ఎస్ తదితర గెజిటెడ్ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# గంగాధర పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమం




**గంగాధర జూన్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గంగాధర పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీ వంశీకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్ఐ వంశీకృష్ణ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సంబంధించిన చరిత్రను, తెలంగాణ సాధనలో అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. పోలీస్ సిబ్బందికి రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సేవల పట్ల మరింత కట్టుబాటుతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# అండర్-18 ఆసియా కప్‌లో భారత్ ఘన విజయం!




జపాన్‌లోని కాకామిగహారా వేదికగా జరుగుతున్న అండర్-18 ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత పురుషుల జట్టు మరోసారి లీగ్ దశలో అద్భుత ప్రదర్శన చేసింది. సోమవారం జరిగిన పూల్-ఎ మ్యాచ్‌లో కెప్టెన్ కేతన్ కుష్వాహ మెరుపు దాడితో భారత్ 4-1 గోల్స్ తేడాతో బలమైన దక్షిణ కొరియా జట్టును సులువుగా ఓడించింది. ఈ విజయంతో లీగ్ దశలో ఆడిన 3 మ్యాచ్‌ల్లో భారత్‌కు ఇది రెండో విజయం కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో భారత కెప్టెన్ కేతన్ కుష్వాహ ముందుండి జట్టును నడిపించాడు. మ్యాచ్ 3వ, 36వ నిమిషాల్లో రెండు కీలక గోల్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కేతన్ కుష్వాహతో పాటు వరిందర్ సింగ్(5వ నిమిషం), షారూఖ్ అలీ(54వ నిమిషం) చెరో గోల్ చేసి స్కోరు బోర్డును పరుగెత్తించారు. కొరియా జట్టు తరఫున కెప్టెన్ యూన్ జెహ్యాక్ 21వ నిమిషంలో ఏకైక గోల్ సాధించాడు. ప్రస్తుతం పూల్-ఎ లో భారత్, కొరియా, జపాన్ జట్లు ఆరేసి పాయింట్లతో సమానంగా ఉన్నప్పటికీ.. మెరుగైన గోల్ డిఫరెన్స్ కారణంగా భారత్ గ్రూప్ టాప్‌లో నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో రెండు పూల్స్ నుంచి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. కొరియాపై సాధించిన ఈ భారీ విజయం భారత్ సెమీస్ అవకాశాలను మరింత మెరుగుపరిచింది. మ్యాచ్ ప్రారంభం నుంచే భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మొదటి క్వార్టర్ ఐదో నిమిషానికే భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆట 3వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను రాహుల్ యాదవ్ పాస్ సాయంతో కెప్టెన్ కేతన్ గోల్‌గా మలిచాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే 5వ నిమిషంలో గాజీ ఖాన్ అందించిన అద్భుతమైన పాస్‌ను వరిందర్ సింగ్ ఏమాత్రం తడబడకుండా గోల్ పోస్ట్‌లోకి పంపి ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. రెండో క్వార్టర్ లో కొరియా పుంజుకుని 21వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చి స్కోరును 2-1కి తగ్గించింది. అయితే మూడు, నాల్గవ క్వార్టర్లలో భారత్ మళ్లీ ఆటపై పట్టు సాధించింది. 36వ నిమిషంలో కేతన్ కుష్వాహ వ్యక్తిగత రెండో గోల్ కొట్టి భారత్‌కు 3-1 ఆధిక్యాన్ని అందించాడు. మ్యాచ్ ముగిసే సమయానికి (53వ నిమిషంలో) కొరియా గోల్ చేయడానికి తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ.. భారత గోల్‌కీపర్ ఆయుష్ రజక్ అద్భుతమైన డిఫెన్స్‌తో దానిని అడ్డుకున్నాడు. ఆ మరుసటి నిమిషంలోనే భారత్ ఎదురుదాడికి దిగి, షారూఖ్ అలీ క్లాస్ షాట్‌తో నాల్గవ గోల్ కొట్టి 4-1తో భారత్ విజయాన్ని ఖరారు చేశాడు. టీమిండియా తన తదుపరి పూల్-ఎ మ్యాచ్‌లో జూన్ 3న చైనీస్ తైపీతో తలపడనుంది.

# ఆస్ట్రేలియాలో కోహ్లికి చాలా పెద్ద ఫ్యాన్ బేస్

**- ఆస్ట్రేలియా ఉప ప్రధాని రిచర్డ్ మార్లెస్**




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్‌లో వరుసగా రెండో టైటిల్ అందుకుంది. ఆర్సీబీ విజయంపై ఆస్ట్రేలియా ఉప ప్రధాని రిచర్డ్ మార్లెస్ హర్షం వ్యక్తం చేశారు. దాంతో పాటు విరాట్ కోహ్లిని ఆకాశానికి ఎత్తుతూ ప్రశంసల జల్లు కురిపించారు. ఆస్ట్రేలియాలో విరాట్ కోహ్లికి చాలా పెద్ద ఫ్యాన్ బేస్ ఉందని చెప్పారు. గతేడాది తాను భారత్‌కు వచ్చినప్పుడు ఆర్సీబీ తొలి కప్ అందుకుందని, ఇప్పుడు రెండో టైటిల్ సొంతం చేసుకుందని ఆయన గుర్తు చేశారు. విరాట్ కోహ్లికి ఆస్ట్రేలియాలో ఎంత పెద్ద ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందో చెప్పాల్సిన అవసరం లేదు. అక్టోబర్‌లో జరిగిన కోహ్లి ఆఖరి ఆస్ట్రేలియా టూర్‌లో ఫ్యాన్స్ ఎలా బ్రహ్మరథం పట్టారో చూశాము. కోహ్లి డకౌట్లు అయినా ఫ్యాన్స్ మాత్రం మంచి సెండాఫ్ ఇచ్చారు. ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు కూడా విరాట్ కోహ్లి - రోహిత్ శర్మలకు ఘన వీడ్కోలు పలికింది. తాజాగా ఐపీఎల్‌లో ఆర్సీబీ వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా నిలవడంపై ఆస్ట్రేలియా ఉప ప్రధాని కోహ్లిపై ప్రశంసల వర్షం కురిపించారు. భారత పర్యటనలో ఉన్న ఆస్ట్రేలియా ఉప ప్రధాని రిచర్డ్ మార్లెస్ ఆర్సీబీ టైటిల్ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా విరాట్ కోహ్లిపై ప్రశంసల జల్లు కురిపించారు. ఆర్సీబీ విజయాన్ని, కోహ్లి ప్రభావాన్ని చూపిస్తూ భారత్ - ఆస్ట్రేలియా ద్వైపాక్షిక సంబంధాల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియాలో కోహ్లి పేరు ఎక్కువగా వినిపిస్తుందని, ప్రపంచ వ్యాప్తంగా అతని అభిమానులు ఉన్నారని గుర్తు చేశారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన మార్లెస్ ఆర్సీబీ విజయాన్ని రెండు దేశాల మధ్య పెరుగుతున్న రిలేషన్‌కు గుర్తుగా అభివర్ణించారు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్స్‌లో కోహ్లి 75 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆస్ట్రేలియా ఆటగాళ్లు జోష్ హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్ కూడా తమ వంత పాత్ర పోషించారని గుర్తు చేశారు. “గతేడాది కూడా ఐపీఎల్ ఫైనల్ తర్వాతి రోజు నేను భారత్‌లోనే ఉన్నాను. ఈ సారి కూడా ఆర్సీబీ విజయం సాధించింది. విరాట్ కోహ్లి 75 పరుగులతో నాటౌట్‌గా నిలిచి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. కోహ్లితో పాటు జోష్ హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్ కూడా కీలక పాత్ర పోషించాడు. భారత్ - ఆస్ట్రేలియా కలిసి ఎలా ముందుకు సాగు తున్నాయో చూపేందుకు ఇది ఓ ఉదాహరణ” అని మార్లెస్ అన్నారు. “ప్రస్తుతం క్రికెట్‌లో విరాట్ కోహ్లి అంటే ఓ సంచలనం. నేను చిన్నప్పటి నుంచి క్రికెట్‌ను ఫాలో అవుతున్నాను. అప్పట్లో నాకు గుర్తున్న కెప్టెన్ బిషాన్ సింగ్ బేడి. ఇప్పుడు కోహ్లి ఆ స్థాయిని దాటేశాడు. కపిల్ దేవ్ పక్కన నిల్చోవడం కూడా ఒక ఫ్యాన్ బాయ్ మూమెంట్” అని ఆస్ట్రేలియా ఉప ప్రధాని అన్నారు.



# కోట్లు పెట్టి డమ్మీ ప్లేయర్లను కొంటున్నారు

**- ఐపీఎల్ ఫ్రాంచైజీలపై గవాస్కర్ ఫైర్..!**

ఐపీఎల్ 2026 ముగిసిన తరుణంలో భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఫ్రాంచైజీల తీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. లోకల్ లీగ్స్‌లో రాణించారని రూ.కోట్లు పెట్టి కొని, ఐపీఎల్‌లో కేవలం రెండు మ్యాచ్‌లకే పరిమితం చేసే ఆటగాళ్లు ‘డమ్మీ’లతో సమానమని మండిపడ్డారు. స్థానిక లీగ్‌లకు, అంతర్జాతీయ స్థాయి బౌలింగ్ ఉండే ఐపీఎల్‌కు చాలా తేడా ఉందని, ఫ్రాంచైజీలు అంచనాలు తలకిందులై డబ్బు వృథా చేసుకుంటున్నాయని ఈ సందర్భంగా సునీల్ గవాస్కర్ పేర్కొన్నారు. ఐపీఎల్ 2026 ముగిసింది. ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రెండో టైటిల్‌ను ముద్దాడింది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ ఫ్రాంఛైజీలను ఉద్దేశించి.. టీమిండియా క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కొన్ని ఫ్రాంచైజీలు.. రూ.కోట్లు పెట్టి డమ్మీ క్రికెటర్లను కొంటున్నాయని గవాస్కర్ వ్యాఖ్యానించారు. దీంతో సునీల్ గవాస్కర్.. ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారనేది చర్చనీయాంశంగా మారింది. భారత క్రికెట్‌కు ఐపీఎల్ ఎంతోమంది ప్రతిభావంతులను ఇచ్చింది. రవిచంద్రన్ అశ్విన్, జస్‌ప్రీత్ బుమ్రా, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా వంటి ప్లేయర్లు ఐపీఎల్ ద్వారానే వెలుగులోకి వచ్చారు. ఇదే సమయంలో పలువురు ఆటగాళ్లు మాత్రం వేలంలో భారీ ధర పలికి.. మైదానంలో అంచనాలను అందుకోలేకపోతున్నారు. రాష్ట్ర, నగర స్థాయి లీగ్‌ల్లో భారీ షాట్లు ఆడటంతో వారిపై ఫ్రాంఛైజీలు ఫోకస్ పెట్టాయి. కానీ ఐపీఎల్‌లో అంతర్జాతీయ స్థాయిలో బౌలింగ్‌ను వారు ఎదుర్కోలేకపోతున్నారు. రాష్ట్ర స్థాయి లీగ్‌లలో బ్యాటింగ్, బౌలింగ్ ప్రమాణాలకు.. ఐపీఎల్‌కు చాలా తేడా ఉంది. కానీ అలాంటి ప్లేయర్ల కోసం ఫ్రాంచైజీలు డబ్బును వృథా చేసుకుంటున్నాయి” అని గవాస్కర్ అన్నారు. “ఫ్రాంచైజీ రూ.కోట్లు పెట్టి ఆటగాడిని కొనుగోలు చేసి.. అతడిని కేవలం 2 మ్యాచ్‌లకే పరిమితం చేయడం కరెక్టు కాదు. దానికి అసలు అర్థమే లేదు. ఓ ఫ్రాంచైజీ గనక అలా చేస్తే ఆ ప్లేయర్ డమ్మీ అన్నట్లే లెక్క. ఐపీఎల్ చాలా త్వరగా ఓ ఆటగాడి అసలు సామర్థ్యాన్ని బయటపెడుతుంది. ఇదే ఐపీఎల్ స్పెషాలిటీ. ప్లేయర్‌పై అతిగా అంచనాలు పెట్టుకున్నారా? నిజంగానే భారీ ఇన్నింగ్స్ ఆడే సామర్థ్యం ఉందా? అనేది ఈజీగా తెలిసిపోతుంది. ఒక సీజన్‌లో పెద్దగా ప్రాధాన్యం లేని మ్యాచ్‌లో సత్తాచాటినా.. కొందరు ఆటగాళ్లు అదే ప్రదర్శన ఆధారంగా వచ్చే సీజన్‌కు ఎంపికవుతున్నారు” అని గవాస్కర్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం గవాస్కర్ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఎవరిని ఉద్దేశించి ఆయన ఈ కామెంట్స్ చేశారనే విషయంపై నెట్టింట చర్చ జరుగుతోంది.




## భారీ మూల్యం చెల్లించుకున్న టిమ్ డేవిడ్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఆటగాడికి షాక్ తగిలింది. భారీ హిట్టింగ్ చేసే ఆస్ట్రేలియా బ్యాటర్ టిమ్ డేవిడ్ ఐపీఎల్ ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చేసిన చిన్న పొరపాటుతో భారీ మూల్యం చెల్లించుకున్నాడు. క్రమశిక్షణా ఉల్లంఘనకు పాల్పడినందుకు ఒక మ్యాచ్ సస్పెన్షన్, మ్యాచ్ ఫీజులో 50% జరిమానా విధించారు. ఈ నిషేధం కారణంగా, టిమ్ డేవిడ్ ఐపీఎల్ 2027 తొలి మ్యాచ్‌లో ఆడేందుకు అవకాశాన్ని కోల్పోయాడు. ఇది ఐపీఎల్ 2026 సీజన్‌లో అతనికి విధించిన మూడో పనిష్మెంట్ కావడం విశేషం. ఫైనల్ మొదటి ఇన్నింగ్స్‌లో 10వ ఓవర్లో గుజరాత్ టైటాన్స్ వికెట్ పడిన వెంటనే ఇది జరిగింది.

# 3.4 కోట్లిచ్చి ఖాళీగా కూర్చోబెట్టిన లక్నో!




లక్నో సూపర్ జెయింట్స్ స్టార్ బౌలర్ మయాంక్ యాదవ్ ఐపీఎల్ 2026లో పూర్తిగా విఫలమయ్యాడు. గాయం నుంచి కోలుకుని వచ్చిన మయాంక్ 4 మ్యాచ్‌లు ఆడి వికెట్లేమీ తీసుకోలేకపోయాడు. లక్నో తరఫున 2022 నుంచి ఐదు సీజన్లు ఆడిన మయాంక్ యాదవ్ ఓవరాల్‌గా పది మ్యాచ్‌లే ఆడాడు. ఈ పది మ్యాచ్‌లలో 9 వికెట్లు పడగొట్టాడు. అయితే మయాంక్‌ను బెంచ్‌కే పరిమితం చేసిన లక్నో.. రూ. 33.4 కోట్లను అతనికి చెల్లించింది. ఐపీఎల్‌లో ఎక్కువ హైప్ తెచ్చుకుని డగౌట్‌కే పరిమితమైన ప్లేయర్ ఎవరంటే మొదటగా గుర్తొచ్చేది మయాంక్ యాదవ్. దేశవాళీ క్రికెట్‌లో రాణించి ఐపీఎల్‌లో అడుగుపెట్టిన మయాంక్ యాదవ్ నెట్స్‌లో మెరుపు బంతులతో కోచ్‌లను కట్టిపడేశాడు. కానీ.. సీజన్‌లో అడుగుపెట్టిన వెంటనే గాయాలతో రూలుడ్ అవుట్ అవడమో, లేక రెస్ట్ తీసుకుని డగౌట్స్‌కి పరిమితమవ్వడమో చేశాడు. లక్నో సూపర్ జెయింట్స్ ఐదేళ్లలో మయాంక్ యాదవ్ కోసం రూ. 33.4 కోట్లు ఖర్చు పెడితే అతను పట్టుమని పది మ్యాచ్‌లు కూడా ఆడలేదు. 150 కిలోమీటర్ల వేగంతో బంతులు విసరగల మయాంక్ యాదవ్.. టీమిండియాలో అడుగుపెట్టిన తొలి మ్యాచ్‌లోనే మెయిడిన్ ఓవర్‌తో సంచలనం సృష్టించాడు. ఐపీఎల్ 2022లో రూ. 20 లక్షల బేస్ ప్రైజ్‌తో మయాంక్ యాదవ్‌ను లక్నో సూపర్ జెయింట్స్ సొంతం చేసుకుంది. మొదటి రెండేళ్లు అంటే 2022, 2023 సీజన్‌లలో మయాంక్ యాదవ్ కేవలం బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఐపీఎల్ 2024లో మయాంక్‌ను రూ. 11 కోట్ల ధరకు రిటైన్ చేసుకున్న లక్నో సూపర్ జెయింట్స్ ఆ సీజన్‌లో కేవలం నాలుగు మ్యాచ్‌లే ఆడించింది.

# వైభవ్ వెనుక కార్పొరేట్ కంపెనీల పరుగులు




క్రికెట్ ప్రపంచంలో ప్రస్తుతం ఒకే ఒక్కడి పేరు మారుమోగిపోతోంది. అతడే 15 ఏళ్ల టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ. ఇటీవలే ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్‌లో ఈ బుడ్డోడు సృష్టించిన సునామీ అంతా ఇంతా కాదు. రాజస్థాన్ రాయల్స్ జట్టు తరఫున ఆడిన వైభవ్.. తన బ్యాటింగ్ విశ్వరూపంతో క్రికెట్ దిగ్గజాలనే ఆశ్చర్యపరిచాడు. ఐపీఎల్ ముగింపు వేడుకల్లో మేజర్ అవార్డులన్నింటినీ ఇతడే క్లీన్ స్వీప్ చేశాడు. దాంతో రాత్రికి రాత్రే ఈ బిహార్ కుర్రాడి బ్రాండ్ వాల్యూ ఆకాశాన్ని తాకింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను సైతం పక్కకు నెట్టి కార్పొరేట్ కంపెనీలు ఈయన వెనుక పరుగులు పెడుతున్నాయి. ఐపీఎల్ 2026 సీజన్‌లో రన్నరప్ రేసులో రాజస్థాన్ క్వాలిఫైయర్-2 లో ఓడిపోయినప్పటికీ, వైభవ్ సూర్యవంశీ మాత్రం చరిత్ర సృష్టించాడు. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ సాధించడంతో పాటు మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్, ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్, సూపర్ స్ట్రైకర్, సూపర్ సిక్సెస్ అవార్డులను కైవసం చేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత చిన్న వయసులో ఈ అవార్డులు గెలవడమే కాకుండా.. ఒకే సీజన్‌లో ఎంవీపీ, ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డులు రెండూ సాధించిన ఏకైక ఆటగాడిగా రికార్డులకెక్కాడు. ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ సైతం స్పందిస్తూ.. భవిష్యత్తులో బాలీవుడ్, హాలీవుడ్ స్టార్ల కంటే పెద్ద సెలబ్రిటీ వైభవ్ అవుతాడని జోస్యం చెప్పారు. ఐపీఎల్‌లో వైభవ్ చూపించిన ప్రతాపానికి బ్యాట్ స్పాన్సర్‌షిప్ మార్కెట్ అప్సెట్ అయిపోయింది. కోహ్లీ బ్యాట్ స్పాన్సర్ ఎమ్ఆర్ఎఫ్, రోహిత్ శర్మ బ్యాట్ స్పాన్సర్ సియట్ లాంటి దిగ్గజ క్రీడా సంస్థలు వైభవ్ బ్యాట్ రైట్స్ కోసం పోటీ పడుతున్నాయి. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం ఒక ప్రముఖ కంపెనీ అయితే ఈ 15 ఏళ్ల కుర్రాడికి ఏకంగా బ్లాంక్ చెక్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రేజ్ చూసి వైభవ్ తన కమర్షియల్ యాడ్స్ రేట్లను ఏకంగా రెట్టింపు చేసేశాడు. వైభవ్ సూర్యవంశీ కమర్షియల్ జర్నీ ప్రముఖ న్యూట్రిషన్ బ్రాండ్ కాంప్లాన్ ఇండియాతో ప్రారంభమైంది. 2026 ప్రారంభంలోనే కాంప్లాన్ సంస్థ అతనితో థోడా ప్లాన్, థోడా కాంప్లాన్ అనే క్యాంపెయిన్ కోసం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ దాదాపు రూ.75 నుంచి 80 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ యాడ్‌లో వైభవ్ క్రమశిక్షణతో కూడిన శిక్షణ, క్రీడాకారులకు పోషకాహారం ఎంత ముఖ్యమనే విషయాలను హైలైట్ చేశారు. వైభవ్ సూర్యవంశీ కమర్షియల్ జర్నీ ప్రముఖ న్యూట్రిషన్ బ్రాండ్ కాంప్లాన్ ఇండియాతో ప్రారంభమైంది. 2026 ప్రారంభంలోనే కాంప్లాన్ సంస్థ అతనితో థోడా ప్లాన్, థోడా కాంప్లాన్ అనే క్యాంపెయిన్ కోసం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ దాదాపు రూ.75 నుంచి 80 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ యాడ్‌లో వైభవ్ క్రమశిక్షణతో కూడిన శిక్షణ, క్రీడాకారులకు పోషకాహారం ఎంత ముఖ్యమనే విషయాలను హైలైట్ చేశారు. మే 30వ తేదీన జార్ఖండ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఇర్ఫాన్ అన్సారీ ఒక కీలక ప్రకటన చేశారు. వైభవ్‌ను యూత్ ఎనర్జీకి నిలువెత్తు రూపంగా అభివర్ణిస్తూ, త్వరలోనే జార్ఖండ్ ఆరోగ్య శాఖ తరుపున ప్రచారకర్తగా నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఇక క్రికెట్ కిట్ విషయానికి వస్తే.. ప్రముఖ స్పోర్ట్స్ తయారీ సంస్థ సరీన్ స్పోర్ట్స్ తో వైభవ్‌కు ఎప్పటి నుంచో ఒప్పందం ఉంది. ఈ ఎస్ఎస్ బ్యాట్ స్పాన్సర్‌షిప్ ద్వారా వైభవ్‌కు ఏడాదికి దాదాపు రూ.50 లక్షల ఆదాయం లభిస్తోంది.

PCW తెలుగు దినపత్రిక



# నాగచైతన్యకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట..

### అశ్లీల కంటెంట్ తొలగించాలని ఆదేశం

నటుడు అక్కినేని నాగచైతన్యకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. తన పేరు, ఫొటో, కీర్తిని దుర్వినియోగం చేస్తూ ఆన్‌లైన్‌లో అశ్లీల, పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను ఏఐ ద్వారా సృష్టించిన నకిలీ చిత్రాలను వ్యాప్తి చేస్తున్నారని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు సానుకూలంగా స్పందించింది. ఇటువంటి కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.



గత 15 ఏళ్లుగా తెలుగు చిత్ర పరిశ్రమలో నటుడిగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగచైతన్య, తన వ్యక్తిత్వ హక్కులకు (పర్సనాలిటీ రైట్స్) భంగం కలుగుతోందని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కొన్ని అశ్లీల వెబ్‌సైట్లు తన పేరును ట్యాగ్‌లు, కేటగిరీలుగా వాడుకుంటూ అభ్యంతరకర కంటెంట్‌కు తప్పుడు ప్రచారం కల్పిస్తున్నాయని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనివల్ల తన పరువు, ప్రతిష్ఠలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటితో పాటు తన అనుమతి లేకుండా తన ఫొటోలతో టీషర్టులు వంటి వస్తువులను (మెర్చండైజ్) ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారని కూడా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ జ్యోతి సింగ్ ధర్మాసనం, నాగచైతన్య వాదనలతో ఏకీభవించింది. నాగచైతన్య ప్రముఖ నటుడని, ఆయన కీర్తి, ప్రతిష్ఠలకు చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. “ఫిర్యాదుదారుడికి అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి ప్రాథమిక ఆధారాలున్నాయి. ఒకవేళ అలా చేయకపోతే, ఆయనకు పూడ్చలేని నష్టం జరుగుతుంది“ అని కోర్టు తన తీర్పులో పేర్కొంది.

ఈ మేరకు నాగచైతన్య పేరు, ఫొటో, వాయిస్ లేదా ఆయన వ్యక్తిత్వాన్ని సూచించే ఏ అంశాన్ని అయినా ఆయన అనుమతి లేకుండా వాణిజ్యపరంగా లేదా వ్యక్తిగతంగా ఉపయోగించరాదని ప్రతివాదులను ఆదేశించింది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌ఫేక్, ఫేస్ మార్ఫింగ్ వంటి టెక్నాలజీల ద్వారా కంటెంట్ సృష్టించడాన్ని నిషేధించింది. అభ్యంతరకర కంటెంట్ ఉన్న యూఆర్ఎల్‌లు, యూట్యూబ్ వీడియోలను 24 గంటల్లోగా తొలగించాలని సంబంధిత వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను సెప్టెంబరు 30కి వాయిదా వేసింది. ఇటీవల కాలంలో తమ వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం కోర్టును ఆశ్రయించిన ప్రముఖులలో అల్లు అర్జున్, నాగార్జున, గౌతమ్ గంభీర్, అభిషేక్ బచ్చన్ వంటి వారి సరసన నాగచైతన్య కూడా చేరారు.

# నటి ప్రియాంక మోహన్‌కు కొరియా ప్రభుత్వ అరుదైన గౌరవం



ప్రముఖ యువ నటి ప్రియాంక అరుళ్ మోహన్‌కు అరుదైన అంతర్జాతీయ గౌరవం లభించింది. ఆమెను దక్షిణ కొరియా పర్యాటక గౌరవ రాయబారిగా నియమిస్తున్నట్లు కొరియా ప్రభుత్వం, కొరియా పర్యాటక సంస్థ (కేటీఓ) అధికారికంగా ప్రకటించాయి. ఇటీవలే ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'మేడ్ ఇన్ కొరియా' అనే తమిళ చిత్రం విడుదలైన నేపథ్యంలో ఈ గౌరవం దక్కడం విశేషం. ఈ సినిమా కొరియా నేపథ్యంలో సాగడం, అక్కడి సంస్కృతిని ప్రతిబింబించడంతో ఆమెను ఈ పదవికి ఎంపిక చేశారు.

ఈ నియామకం పట్ల ప్రియాంక మోహన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తన సంతోషాన్ని, కృతజ్ఞతలను వ్యక్తం చేశారు. “ఇది నాకు దక్కిన అద్భుతమైన గౌరవం. కొరియా పర్యాటక గౌరవ రాయబారిగా నన్ను నియమించడం ఎంతో ప్రత్యేకం. కొరియా సంస్కృతిని, సంప్రదాయాలను భారతీయ ప్రేక్షకులకు మరింత చేరువ చేసే వ్యక్తిగా నన్ను గుర్తించినందుకు కొరియా ప్రభుత్వానికి, పర్యాటక సంస్థకు హృదయపూర్వక ధన్యవాదాలు. కొరియా సంస్కృతి, ప్రజల ఆప్యాయత నన్ను ఎప్పుడూ ఆకట్టుకుంటాయి. ఈ అందమైన ప్రయాణంలో భాగమైనందుకు సంతోషిస్తున్నాను“ అని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు.

ప్రియాంక మోహన్‌కు కొరియాతో ఉన్న అనుబంధం ఇటీవలి కాలంలో బలపడింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసిన విందులో ఆమె పాల్గొన్నారు. ఆ విందుకు ప్రధాని నరేంద్ర మోదీ, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ కూడా హాజరయ్యారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఆ కార్యక్రమంలో అగ్ర నాయకులతో కలిసి భోజనం చేయడం ఒక అద్భుతమైన అనుభవమని, తన 'మేడ్ ఇన్ కొరియా' చిత్రాన్ని వారు అభినందించడం ఎప్పటికీ మరిచిపోలేనని ప్రియాంక అప్పుడు కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు.రా కార్తీక్ దర్శకత్వం వహించిన 'మేడ్ ఇన్ కొరియా' చిత్రం మార్చి 12న నేరుగా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో విడుదలైంది. దక్షిణ కొరియాలో చిత్రీకరణ జరుపుకున్న తొలి తమిళ చిత్రంగా ఇది రికార్డు సృష్టించింది. ఈ సినిమా ద్వారానే ప్రియాంక తొలిసారి అంతర్జాతీయ నటులతో కలిసి పనిచేశారు. ఇప్పుడు అదే సినిమా ఆమెకు ఈ అంతర్జాతీయ గుర్తింపును తీసుకురావడం గమనార్హం.



# 'ఐరన్ లెగ్' ట్రోలింగ్‌పై

## కృతి శెట్టి ఘాటు స్పందన

'ఉప్పెన' సినిమాతో రాత్రికి రాత్రే స్టార్ స్టేటస్ సంపాదించుకున్న యువ నటి కృతి శెట్టి, తనపై జరుగుతున్న సోషల్ మీడియా ట్రోలింగ్‌పై ఎట్టకేలకు నోరు విప్పారు. ఉప్పెన తర్వాత 'బంగార్రాజు', 'శ్యామ్ సింగ రాయ్' వంటి చిత్రాలు మంచి విజయాన్ని అందించినప్పటికీ, ఆ తర్వాత ఆమె నటించిన వరుస తెలుగు సినిమాలు బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశపరిచాయి. వీటికి తోడు ఇటీవల ఆమె నటించిన తమిళ చిత్రాలు 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', 'వా వా వాతియార్' కూడా ఆశించిన స్థాయిలో ఆడకపోవడంతో, నెటిజన్లు ఆమెను 'ఐరన్ లెగ్' అంటూ దారుణంగా ట్రోల్ చేయడం ప్రారంభించారు.

ఈ నేపథ్యంలో ఒక తాజా ఇంటర్వ్యూలో మాట్లాడిన కృతి శెట్టి, తనపై వస్తున్న విమర్శలను నేరుగా తిప్పికొడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక సినిమా ఫ్లాప్ అయితే దానికి హీరోయిన్లను బ్లేమ్ చేయడం చాలా అన్యాయమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

చాలా సినిమాల్లో హీరోయిన్ల పాత్ర నిడివి చాలా తక్కువగా ఉంటుందని, సినిమాను ఎలా తీయాలి లేదా కథను ఎలా నడపాలనే విషయాల్లో తమకు ఎలాంటి నిర్ణయాధికారాలు ఉండవని స్పష్టం చేశారు. అలాంటప్పుడు తమపై 'ఐరన్ లెగ్' అనే ట్యాగ్ వేయడం విచిత్రంగా ఉందని, అసలు పరిశ్రమలో ఒక సక్సెస్‌ఫుల్ సినిమాను ఎలా తీయాలో ఎవరికీ ముందుగా తెలియదని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు.కృతి శెట్టి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు టాలీవుడ్, కోలీవుడ్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. సినిమా ఫ్లాప్ అయితే హీరోయిన్లను మాత్రమే టార్గెట్ చేయడం తప్పు అంటూ ఒక వర్గం ఆమెకు మద్దతు తెలుపుతుండగా, మరో వర్గం మాత్రం దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సినిమా హిట్ అయినప్పుడు క్రెడిట్ తీసుకునే హీరోయిన్లు, ఫ్లాప్ అయినప్పుడు మాత్రం బాధ్యత తీసుకోరా? అంటూ కొందరు నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. అలాగే సక్సెస్ ఫార్ములా ఎవరికీ తెలియదంటూ కృతి చేసిన వ్యాఖ్యలు సీనియర్ దర్శకులు, నిర్మాతల అనుభవాన్ని తక్కువ చేసి చూపించేలా ఉన్నాయంటూ పరిశ్రమలోని కొందరు అభిప్రాయపడుతున్నారు.

# 'యూఫోరియా' నా కెరీర్‌లో ఓ మైలురాయి: దర్శకుడు గుణశేఖర్



'యూఫోరియా' చిత్రం తన కెరీర్‌లోనే ఒక ముఖ్యమైన మైలురాయి అని, అది తనలో కొత్త సృజనాత్మక శక్తిని నింపిందని ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ అన్నారు. మంగళవారం తన 62వ పుట్టినరోజు సందర్భంగా ఆయన సోమవారం మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. సాధారణంగా పుట్టినరోజున మీడియా ముందుకు రాని తాను, 'యూఫోరియా'కు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూసి మాట్లాడాలనిపించిందని తెలిపారు.“నా కెరీర్‌లో నేను చేసిన అన్ని సినిమాల్లో 'యూఫోరియా' చాలా ప్రత్యేకం. ఇలాంటి సినిమాలు మరిన్ని తీయాలని సోషల్ మీడియాలో ఎన్నో కామెంట్లు చూశాను. సినిమాపై వచ్చిన విశ్లేషణాత్మక వీడియోలను లక్షలాది మంది వీక్షించారు“ అని గుణశేఖర్ వివరించారు. ఈటీవీ విన్, ఆహా వంటి ఓటీటీలతో పాటు అమెజాన్ ప్రైమ్ వీడియో రెంటల్స్‌లో కూడా సినిమా ట్రెండింగ్‌లో ఉందని, థియేటర్లలో చూడలేకపోయామని చాలామంది బాధపడ్డారని ఆయన పేర్కొన్నారు.ఈ చిత్రానికి తానే నిర్మాతగా ఉండటం వల్ల మార్కెటింగ్ పరంగా కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని ఆయన అంగీకరించారు. “నిర్మాతగా కూడా నేనే ఉండటం ఒక మైనస్ కావచ్చు. మార్కెటింగ్ పరంగా విఫలమయ్యానని భావిస్తున్నాను. భవిష్యత్తులో నిర్మాణ భాగస్వాములతో కలిసి పనిచేస్తాను,“ అని స్పష్టం చేశారు.మైనర్ల నేరాలకు సంబంధించిన నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ సినిమాను తీశానని, యువతలో పెరిగిపోతున్న మాదకద్రవ్యాల వాడకం వంటి సామాజిక అంశాలపై ఇది అవగాహన కల్పిస్తుందని గుణశేఖర్ తెలిపారు. తన సినిమా ఆలోచనా విధానం కూడా మారిందని చెబుతూ, “మనం హీరోల కోసం కథలు రాయడం ఆపాలి. ముందు కథ రాసుకుని, దానికి సరిపోయే హీరోను ఎంపిక చేసుకోవాలి,“ అని అన్నారు.

భూమికా చావ్లా, సారా అర్జున్ వంటి నూతన నటీనటులు నటించిన 'యూఫోరియా' ఫిబ్రవరి 2026లో విడుదలైంది. 'ఒక్కడు', 'చూడాలనివుంది', 'రుద్రమదేవి' వంటి భారీ చిత్రాలను అందించిన గుణశేఖర్, 'యూఫోరియా'కు ముందు 'శాకుంతలం' చిత్రానికి దర్శకత్వం వహించారు.

# హైదరాబాద్‌పై 'పెద్ది' యూనిట్ ఫోకస్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, దర్శకుడు బుచ్చిబాబు సానా రూపొందించిన పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు సమయం దగ్గర పడుతుండటంతో ప్రచార కార్యక్రమాలను చిత్ర బృందం ఉద్ధృతం చేసింది. ఈ నెల 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే ప్రమోషన్లలో భాగంగా నేడు హైదరాబాద్‌లో ఓ భారీ ప్రెస్ మీట్ నిర్వహించేందుకు చిత్ర యూనిట్ సిద్ధమైంది.

నిన్న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో లక్షలాది అభిమానుల మధ్య అట్టహాసంగా జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్, సినిమాపై ఉన్న హైప్‌ను మరింత పెంచింది. అదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ, చిత్ర బృందం ఈ రోజు మధ్యాహ్నం 3 గంటలకు బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఈ కార్యక్రమానికి హీరో రామ్ చరణ్‌తో పాటు హీరోయిన్ జాన్వీ కపూర్, సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్, దర్శకుడు బుచ్చిబాబు సానా, కీలక పాత్రధారులు జగపతి బాబు, దివ్యేందు శర్మ, నిర్మాత వెంకట సతీష్ కిలారు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను, పాత్రల వివరాలను, చివరి నిమిషం అప్‌డేట్స్‌ను పంచుకోనున్నారు.విలేజ్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో రూపుదిద్దుకున్న 'పెద్ది' చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన ట్రైలర్, టీజర్లు, పాటలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా రామ్ చరణ్ సరికొత్త లుక్, బుచ్చిబాబు టేకింగ్, ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో ప్రమోషన్లు నిర్వహించిన చిత్ర బృందం, విడుదల ముందు హైదరాబాద్‌లో ఈ ప్రెస్ మీట్‌ను కీలకంగా భావిస్తోంది.మరోవైపు రేపు రాత్రి నుంచే ఓవర్సీస్‌తో పాటు ఏపీలోని కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రీమియర్ షోలు పడనున్నాయి. దీంతో సినిమా టాక్ ముందుగానే బయటకు వచ్చే అవకాశం ఉంది. భారీ అంచనాల మధ్య విడుదలవుతున్న ఈ చిత్రం, రామ్ చరణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు.

# హీరో విజయ్‌తో రిలేషన్ రూమర్స్..

## పరోక్షంగా కౌంటర్ ఇచ్చిన నటి త్రిష!



నాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో నటి త్రిష రిలేషన్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు కొన్ని రోజులుగా సినీ, రాజకీయ రంగాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా తన వ్యక్తిగత విషయాలపై వచ్చే రూమర్లపై స్పందించని త్రిష, తాజాగా సోషల్ మీడియా వేదికగా పరోక్షంగా స్పందించారు. తన పెంపుడు కుక్క ఫొటోను షేర్ చేస్తూ.. “నా వ్యక్తిగత విషయాల్లో తలదూర్చడానికి దీన్ని మాత్రమే అనుమతిస్తాను“ అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ పెట్టారు. నేరుగా ఎవరి పేరు ప్రస్తావించకపోయినప్పటికీ, తనపై అసత్య ప్రచారాలు చేస్తున్న వారికి కౌంటర్‌గానే ఈ పోస్ట్ పెట్టారని అభిమానులు భావిస్తున్నారు.

మరోవైపు, మే నెల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ త్రిష చేసిన “మ్యాజికల్ మే“ పోస్ట్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. ఈ ఏడాది మే నెలను తలచుకున్నప్పుడల్లా తన ముఖంపై చిరునవ్వు వస్తూనే ఉంటుందని ఆమె పేర్కొన్నారు. మే నెలలోనే త్రిష పుట్టినరోజు ఉండడం, అదే సమయంలో తన ఆప్తమిత్రుడు విజయ్ తమిళనాడు ఎన్నికల్లో ఘన విజయం సాధించి సీఎం కావడం విశేషం. దీనికి తోడు ఆమె నటించిన 'కరుప్పు' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ హిట్‌గా నిలిచి 348 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ వరుస విజయాల వల్లే ఆమె ఈ పోస్ట్ పెట్టారు.